ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
3
సోమవారం 21 జూలై 2025

విరూపాక్షమ్మకు వైభవంగా బోనాలు

● మంత్రి ఇచ్చిన విందుకు వేలాదిగా ప్రజలు



విందును ప్రారంభిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమటికోన గ్రామం బోరెడ్డిగారిపల్లెలో జరుగుతున్న విరూపాక్షమ్మ తల్లి బోనాల పండుగ అత్యం వైభవంగా జరిగింది. శనివారం రాత్రి రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకు న్నారు. ఆదివారం ఉదయం 11 గంటలకు మంత్రి ఇచ్చిన విందులో జిల్లా నలుమూలల నుంచి అధికారులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, ప్రజలు భారీగా పాల్గొన్నారు. కలెక్టర్ చామకూరి శ్రీధర్, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్, పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా బాబు, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చిన్నబాబు, టీడీపీ నాయకులు జయచంద్ర నాయుడు పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా వచ్చిన మండిపల్లి అభిమానులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలకు మంత్రి దగ్గరుండి భోజనాలు వడ్డించారు.



విందులో పాల్గొన్న కలెక్టర్ చామకూరి శ్రీధర్, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, తదితరులు

భక్తిశ్రద్ధలతో అమ్మవారి తిరునాళ్లు



బండ్లవంక నడివీధి గంగమ్మకు సారె తీసుకెళుతున్న మహిళలు

పీలేరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఓ వైపు అమ్మవారి తిరునాళ్లు... మరో వైపు ఆడికృత్తిక ఉత్సవాలతో పీలేరులో ఆదివారం ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. పీలేరు పట్టణం బండ్లవంకలోని నడివీధి గంగమ్మ ఆలయంలో జరిగిన తిరునాళ్లలో బండ్లవంక ప్రాంతంలోని మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు. 108 మంది మహిళలు అమ్మవారికి ఆషాఢం సారెతో పాటు కలశాలను పురవీధుల్లో ఊరేగించి అమ్మవారికి సమర్పించారు. పీలేరు-చిత్తూరు మార్గంలోని మోడల్ కాలనీలో వెలసి ఉన్న యల్లమ్మ దేవి ఆలయంలో తిరునాళ్ల సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజల్లో పెద్దఎత్తున స్థానికులు పాల్గొన్నారు. స్థానిక షుకూర్ థియేటర్ వద్ద ఉన్న గణపతి ఆలయంలోని సుబ్రహ్మణ్య స్వామిని ఆడికృత్తిక సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో పీలేరు ఏఎంసీ చైర్మన్ పురం రామ్మూర్తి, ఆలయ కమిటీ సభ్యులు పోలిశెట్టి సురేంద్ర, శేఖర, దేవిరెడ్డి వెంకటరమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యల్లమ్మ తల్లికి చల్ల బోనాలు



యల్లమ్మ తల్లికి చల్లను తీసుకెళ్తున్న మహిళలు, యువతులు

సుండుపల్లె, జూలై 20 (ఆంధ్రజ్యోతి): యల్లమ్మ తల్లికి చెన్నంశెట్టిపల్లి గ్రామస్థులు చల్ల బోనాలను సమర్పించారు. ఆదివారం ఉదయం ఊరంతా కలిసి అమ్మవారికి డప్పు వాయిద్యాలు, బాణాసంచాల నడుమ చల్లను భక్తిశ్రద్ధలతో తీసుకెళ్లారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి చల్లను నైవేద్యంగా సమర్పించారు. పాడిపంటలతో పశుపక్షాదులతో పల్లెను చల్లంగా చూడు తల్లి అని వేడుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు వెంకట్రమణ, తోట రవీంద్ర, రామాంజులు, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిదేవిగా రెడ్డెమ్మతల్లి

● అమ్మవారికి సారె సమర్పించిన భక్తులు

గుర్రంకొండ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): సంతానలక్ష్మిగా పేరుగాంచిన రెడ్డెమ్మ అమ్మవారు ఆదివారం శాకంబరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం ఆషాఢమాసం సందర్భంగా ఆలయంలో ఉదయాన్నే అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు ఆలయంలో మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి.

అమ్మవారికి సారె సమర్పించిన భక్తులు..

రెడ్డెమ్మ అమ్మవారికి సమరతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వందలాది మంది భక్తులు అమ్మవారికి సారె సమర్పించారు. దద్దాలవారిపల్లె రామాలయం నుంచి ఆలయం వరకు ర్యాలీ నిర్వహించి మహిళలు సారెను భక్తిశ్రద్ధలతో సమర్పించారు.



సారె తీసుకొస్తున్న భక్తులు



శాకంబరిదేవిగా రెడ్డెమ్మ తల్లి

ఈ ఏడాది రూ.50 కోట్లే...



రవాణాకు సిద్ధంగా ఉన్న మామిడి కాయల లారీలు



● గత ఏడాది రూ.100 కోట్లు
● వాతావరణం, చీడపీడలతో చతికిలపడ్డ వ్యాపారం
● మామిడి రైతుకు నష్టాలే...

రైల్వేకోడూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఫలాల్లో రాజు అయిన మామిడి ఈ ఏడాది రైతులను నట్టేట ముంచింది. ధరలు పాతాళానికి పడిపోవడంతో పాటు జ్యూస్ ఫ్యాక్టరీల నుంచి డిమాండ్ లేకపోవడంతో ఈ ఏడాది మామిడి వ్యాపారం సగానికి పడిపోయింది. గత ఏడాది రూ.100 కోట్లకు పైగా జరగ్గా ఈ ఏడాది రూ.50 కోట్లు మాత్రమే జరిగింది. ఆశించిన స్థాయిలో దిగుబడి రాకపోవడంతో పాటు వాతావరణంలో మార్పులు, బంగారు ఈగల దాడి, కాయల్లో పురుగులు, చీడ పీడలు వ్యాపించడంతో డిమాండ్ తగ్గి వ్యాపారం చతికిలపడింది. రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి మార్కెట్‌లోకి మామిడి కాయలు రావడం కూడా ధరలు పడిపోవడానికి ఒక కారణం. అదే కాకుండా కాయలు ఒకేసారి ముదిరిపోవడంతో చెట్లకే మాగిపోయి నేలరాలిపోయాయి. ఈ ఏడాది మామిడి పూతల సమయంలో వాతావరణంలో మార్పుల కారణంగా వచ్చిన పూతలు రాలిపోయాయి. ఆలస్యంగా అయినా పూతలు ఆశించిన స్థాయిలో వచ్చాయి. రైతులు అనేక రకాలుగా ఎరువులు, పురుగు మందులు, నీటి యాజమాన్యం చేపట్టారు. పిందె దశలోనే పలు రకాల సమస్యలను రైతులు ఎదుర్కొన్నారు. కాయలు కొన్ని తోటల్లో నాణ్యతా ప్రమాణాలతో వచ్చాయి. మరికొన్ని తోటల్లో నాణ్యతగా రాలేదు. దీనికి తోడు కాయలకు బంగారు ఈగలు దాడి చేశాయి. కాయల్లో పురుగులు పడటంతో మార్కెట్ పడిపోయింది. బేనీషా, తోతాపూరి, రుమాణి, ఖాదర్, మల్లికా, ఇమాంపసందు, నీలం, కాలేపాడు, నాటు రకాల మామిడి కాయలు మార్కెట్‌లోకి వచ్చాయి. సీజన్ మొదట్లో ధరలు ఆశించిన స్థాయిలో ఉన్నా తర్వాత పూర్తిగా పతనమయ్యాయి. రైల్వేకోడూరు మామిడి యార్డులో సుమారుగా 70 మండీలు ఉన్నాయి. ఈ ఏడాది రోజుకు ఇతర రాష్ట్రాలకు 100 లారీల్లో కాయలను ఎగుమతి చేశారు. సీజన్‌లో 8 వేల లారీల్లో కాయలు పంపించారు. రూ.50 కోట్ల మేరకు వ్యాపారం సాగింది. ప్రస్తుతం తోతాపూరి మార్కెట్‌కు టన్ను రూ.8 వేలు, నీలం టన్ను రూ.15 వేలు పలుకుతోంది. ఈనెల 25 తేదీ వరకు మామిడి వ్యాపారం ఉంటుంది. తర్వాత ఉమ్మకాపు మామిడి కాయలు మార్కెట్‌లోకి వస్తాయి.



రైల్వేకోడూరు మామిడియార్డులో రాసిపోసిన నీలం మామిడి కాయలు

మామిడిలో నష్టాలే లాభాలు లేవు



మామిడిలో ఈ ఏడాది రైతులకు నష్టాలే తప్ప లాభాలు రాలేదు. ఆశించినంత కాపు వచ్చింది. పురుగులు, చీడపీడలు వ్యాప్తి చెందడంతో రైతులు విపరీతంగా నష్టపోయారు. ఒకేసారి కాయలు మార్కెట్‌కు రావడం కూడా ఇబ్బంది కల్గింది. రైతులు చేసిన అప్పులు ఈ ఏడాదిలో తీరిపోయి సమస్యలు తొలగిపోతాయన్న సంతోషం ఉండింది. అయితే డిమాండ్ లేక కాయలు అమ్ముడుపోలేదు.

- మల్లు సుబ్బరామిరెడ్డి, రైతు, యానాదిపల్లె

ఆరు ఎకరాల్లో కాయలు వదిలేశా



ఆరు ఎకరాల్లో మామిడి కాయలను వదిలేశాను. ధరలు ఆశించినంత లేకపోవడం, కాయలు మాగి రాలిపోయాయి. కూలీలకు కూడా డబ్బులు రాలేదు. ఎరువులు, కూలీలు, దున్నకాలు, పురుగు మందులు ముందస్తుగా పిచికారి చేశాను. ఖర్చు పెట్టిన దాని కంటే ఎక్కువగా నష్టాలు చవిచూశాను.

- ఖాజామొహిద్దీన్, రైతు, రాఘురాజపురం

వ్యాపారం రూ.50 కోట్లతో ముగిసింది




మామిడి వ్యాపారం ఈ ఏడాది రూ.50 కోట్లతో ముగిసింది. మామిడి వ్యాపారం సాఫీగా సాగుతుందని అనుకున్నాము. డిమాండ్, కాయలలో పురుగులు, చీడపీడలు వ్యాప్తి చెందడంతో రైతులతో పాటు వ్యాపారులు కూడా నష్టాలు చవిచూశారు. గత ఏడాది వ్యాపారం బాగా సాగింది.

- రియాజ్, మామిడి వ్యాపారి, రైల్వేకోడూరు

రంపాలతో రప్పా..రప్పా...

● భారీ చింత వృక్షాలు నరికివేత...
● లారీల్లో తమిళనాడుకు తరలింపు
● అధికారులకు తెలిపినా పట్టించుకోని వైనం

గుర్రంకొండ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కలప వ్యాపారుల రంపాల రప్పా..రప్పా ధాటికి భారీ చింత వృక్షాలు నేలకొరుగుతున్నాయి. ఈ వ్యాపారుల ధాటికి పదుల సంఖ్యలో భారీ చింత వృక్షాలు బయటి రాష్ట్రాలకు తరలిపోతున్నాయి. ప్రభుత్వ భూములు, వంక పోరంబోకు స్థలంలో ఉన్న వృక్షాలను కూడా నరికేస్తున్నట్లు రెవెన్యూ అధికారులకు గ్రామస్థులు చెప్పినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. మండలంలోని టి.రాచపల్లె పంచాయతీ పరిధిలోని దిగువబురుజుపల్లె, టి.రాచపల్లె, బురుజుపల్లె గ్రామాల్లో భారీ వృక్షాలున్నాయి. ఈ వృక్షాలను చిత్తూరుకు చెందిన ఓ కలప వ్యాపారి కొనుగోలు చేశాడు. ఈ క్రమంలో గ్రామాల్లోని భారీ చింత వృక్షాలను 20 రోజులుగా తమిళనాడుకు చెందిన కూలీల చేత నరికిస్తున్నారు. వీటితో పాటు ప్రభుత్వ భూములు, దేవుడి మాన్యం భూముల్లోని వృక్షాలను కూడా ఇష్టానుసారంగా నరికేస్తూ తమిళనాడుకు తరలిస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం నుంచి చింతచెట్లను నరికి రాత్రి పూట లారీల్లో గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ భూమిలో చింత చెట్లను నరికినట్లు రెవెన్యూ, అటవీశాఖ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని టీడీపీ నాయకులు చెబుతున్నారు. ఈ విషయమై వీఆర్వో శంకరను వివరణ కోరగా టి.రాచపల్లెలో చింతచెట్లను కోస్తున్నట్లు తమకు ఫిర్యాదులు వచ్చాయని, నరికేసిన చింతవృక్షాలను తరలించకుండా వీఆర్‌ఏను కాపలా ఉంచినట్లు తెలిపారు. అక్రమంగా చింతచెట్లను నరికేసిన వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.





చింతచెట్లను కోస్తున్న కూలీలు, (ఇన్‌సెట్లో) టి.రాచపల్లెలో నరికేసిన భారీ చింతవృక్షం

రూ.220 కోట్ల ఆస్తి.. ప్రయోజనం నాస్తి..

5

● నిరుపయోగంగా 20 ఎకరాల క్రీడా మైదానం
● నిర్వహణ లేక పెరిగిన ముళ్ల పొదలు

చెరువులో పడి వ్యక్తి మృతి

● మృతదేహాన్ని వెలికితీసిన అగ్నిమాపక సిబ్బంది



మారెప్ప మృతదేహాన్ని బయటకు తెస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పెద్దతిప్పసముద్రం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కందుకూరు వ్యాసరాయ సముద్రం చెరువులో ప్రమాదవశాత్తు పడి వ్యక్తి చెందిన సంఘటన పెద్దతిప్పసముద్రం మండలంలో జరిగింది. స్థానికులు అందించిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. కమ్మచెరువు పంచాయతీ మొరుసుపల్లెకు చెందిన మారెప్ప (62) ఆదివారం ఉదయం గ్రామానికి సమీపంలో ఉన్న కందుకూరు వ్యాసరాయ సముద్రం చెరువులో గొర్రెలను కడిగేందుకు తోటి గొర్రెల కాపరులతో కలిసి వెళ్లాడు. చెరువులో ఉన్న ఒక గుంతలో గొర్రెలను కడుగుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి గుంతలో పడిపోయాడు. పక్కనే గొర్రెల కాపరులు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో వారు గ్రామస్థులకు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ములకలచెరువు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో అగ్నిమాపక అధికారి వీరభద్రారెడ్డి తమ సిబ్బందితో అక్కడికి చేరుకుని 4 గంటలు శ్రమించి మృతదేహాన్ని వెలికితీశారు. ఇంటి పెద్ద దిక్కుగా ఉన్న వ్యక్తి మృత్యువాత పడడంతో కుటుంబ సభ్యులు, భార్య పిల్లలు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ హరిహరప్రసాద్ తెలిపారు.

వైసీపీ నేతలూ ఖబడ్దార్

● తప్పుడు ప్రచారాలు మానుకోకపోతే అంతు చూస్తాం
● మీడియా సమావేశంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతలు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో పాటు తనపై, కూటమి ప్రభుత్వంపైన తప్పుడు ప్రచారాలు మానుకోకపోతే అంతు చూస్తామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హెచ్చరించారు. ఆదివారం రాత్రి రాయచోటి పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఆదివారం రాయచోటి చిన్నమండెం, సంబేపల్లె మండలాల్లో జరిగిన వైసీపీ సమావేశాల్లో మాజీ ఎమ్మెల్యే రమేశ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబుపైన తనపైన తప్పుడు మాటలు మాట్లాడటం మంచిది కాదని, మరోసారి ఇలా జరిగితే రోడ్డుపై గుడ్డలు చించి కొడతామని మంత్రి హెచ్చరించారు. వైసీపీకి అమ్ముడుపోయిన రమేశ్‌కుమార్‌రెడ్డి నాడు జగన్‌రెడ్డిని తిట్టిన ఆయనే నేడు జగన్‌రెడ్డి సచ్ఛీలుడంటూ దెయ్యాలు వేదాలు వల్లించినట్లు మాట్లాడడం సిగ్గుచేటన్నారు. వైసీపీలో అతని పోస్ట్ ఏందో తెలియని పరిస్థితుల్లో రమేశ్‌రెడ్డి ఉన్నాడని, అధిష్ఠానం దగ్గర మెప్పుకోసం మీటింగ్‌లో సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

సమావేశంలో టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ నాగేశ్వర్‌నాయుడు, టీడీపీ జిల్లా కార్యదర్శి మట్లి శ్రీనివాసులునాయుడు, మహిళా నేతలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే రమేశ్‌రెడ్డి అరెస్ట్

లక్కిరెడ్డిపల్లె, జూలై 20 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హిందూపురం పార్లమెంట్ పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్యే రమేశ్‌కుమార్‌రెడ్డిని ఆదివారం అరెస్టు చేసినట్లు సీఐ కొండారెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రాబునాయుడు, మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిలపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, రమేశ్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ రాయచోటి నియోజకవర్గ నాయకుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డితో పాటు టీడీపీ కార్యకర్తలు, అభిమానులు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు రమేశ్‌రెడ్డిని అరెస్ట్ చేసి మదనపల్లె తాలూకా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



రమేశ్‌రెడ్డిని స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

గండికోటలో తగ్గుతున్న నీటిమట్టం



కొండాపురం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టులో రోజురోజుకూ నీటిమట్టం తగ్గుతూ వస్తోంది. ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో లేకపోవడంతో నీటిమట్టం తగ్గుతోంది. ప్రస్తుతం 14.19 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. గండికోట ప్రాజెక్టు నుంచుట మెయిన్ కెనాల్‌కు 150 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా 20 క్యూసెక్కుల నీటిని వదులుతున్నామన్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో లేదని ఈఈ తెలిపారు. కాగా గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 26.85 టీఎంసీలు.

రూ.220 కోట్ల ఆస్తి..
ప్రయోజనం నాస్తి..



నిరుపయోగంగా ఉన్న ఇండోర్ స్టేడియం

- నిరుపయోగంగా 20 ఎకరాల క్రీడా మైదానం
- నిర్వహణ లేక పెరిగిన ముళ్ల పొదలు
- జాతీయ స్థాయి క్రీడాకారులున్నా.. శిక్షణకు అవకాశం సున్నా..


మందుబాబులకు అడ్డాగా మారిన గ్రీన్‌ఫీల్డ్ స్టేడియం


క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన సబ్‌స్టేషన్


క్రీడా మైదానంలో పరిచిన కంకర

రాజంపేట పార్లమెంటు నియోజకవర్గ కేంద్రంలో వందలాది కోట్ల రూపాయల విలువ చేసే మైదానం రాజంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం. రాజంపేట - రాయచోటి రోడ్డులో ఫ్లైఓవర్ బ్రిడ్జి ఆనుకుని సుమారు 20 ఎకరాల్లో ఈ క్రీడా మైదానం ఉంది. ఇక్కడ సెంటు రమారమి 50 లక్షలు ఉంటుంది. లోపలి భాగంలో కూడా సరాసరి రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షలు ఉంటుంది. ఈ మొత్తం ఆస్తి విలువ రూ.200 కోట్లకు పైబడే. సుమారు 80 వేల జనాభా కలిగిన రాజంపేట పట్టణంలో ఉన్న ఈ క్రీడా మైదానాన్ని ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలల విద్యార్థులు వినియోగించుకుంటున్నారు.

రాజంపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు క్రీడల్లో తర్ఫీదునిచ్చి ఉత్తమ క్రీడాకారులుగా తీర్చి దిద్దేందుకు పలువురు దాతలు 20 ఎకరాల సువిశాల స్థలాన్ని విరాళంగా ఇచ్చారు. ప్రభుత్వం ఆ స్థలం చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించింది. పట్టణంతోపాటు, చుట్టుపక్కల గ్రామాల్లో ఉన్న పాఠశాలలు, జిల్లా, రాష్ట్ర స్థాయికి చెందిన క్రీడా పోటీలు నిర్వహించాలంటే ఈ క్రీడా మైదానంలో నిర్వహించాల్సిందే. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ లాంటి పలువురు ప్రముఖ నేతల బహిరంగ సభలు కూడా ఈ మైదానంలోనే నిర్వహించారు. అటువంటి ఈ క్రీడా మైదానంపై ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోంది. కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా క్రీడలకు అధిక ప్రాధాన్యమిచ్చారు.

సౌకర్యాలు కల్పించాలి



రాజంపేట క్రీడా మైదానంలో సౌకర్యాలను కల్పిస్తే స్థానిక క్రీడాకారులు ఉన్నత స్థాయికి చేరుకుంటారు. ఇప్పుడున్న ఇండోర్, గ్రీన్‌ఫీల్డ్ స్టేడియాలను అభివృద్ధి చేయాలి. క్రీడా మైదానంలో కనీస సౌకర్యాలను కల్పించడంతోపాటు, నిర్వహణకు ప్రత్యేక సిబ్బందిని నియమించాలి.

- షమీర్‌బాషా,
విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు

అందులో భాగంగా రాజంపేట క్రీడా మైదానంలో ఇండోర్ స్టేడియాన్ని, గ్రీన్‌ఫీల్డ్ స్టేడియాన్ని ఏర్పాటు చేశారు. దీంతో ఈ క్రీడా మైదానానికి ఎంతో ప్రాముఖ్యత వచ్చింది. ఈ స్టేడియాల్లో బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, జిమ్, అథ్లెటిక్స్ లాంగ్‌జంప్, క్రికెట్ పోటీలు నిర్వహిస్తుండేవారు. రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లు కూడా నిర్వహించారు.

క్రీడా ప్రాంగణంలోనే సబ్‌స్టేషన్

గత పాలకులు పట్టించుకోకపోవడంతో క్రీడా మైదానం ప్రాంగణంలో ఓ వైపున సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. దీంతో జానీబాషాపురం ఆనుకుని ఉన్న సుమారు 3 ఎకరాల పైబడి క్రీడా మైదానం కంపచెట్లకు నిలయంగా మారింది. ఈ ప్రాంతంలో ఏదైనా స్టేడియాన్ని ఏర్పాటు చేస్తే అందరికి ఉపకరించేది. ఆ ఖాళీ ప్రాంతాన్ని పట్టించుకోకపోవడంతో కంపచెట్లు బాగా ఏపుగా పెరిగి విషసర్పాలు తిరుగుతూ, పందుల నివాసానికి ఉపయోగపడుతోంది. ఇక క్రీడా మైదానంలో వాకర్స్ అసోసియేషన్ పాదచారులు నడవడానికి ట్రాక్ ఏర్పాటు చేసింది. ప్రభుత్వం ద్వారా కొన్ని ట్రాక్‌లు ఏర్పాటు చేసినా నాణ్యత లోపం కారణంగా ఉపయోగంలో లేవు.

ఆగిపోయిన అభివృద్ధి

ప్రస్తుతం ఇండోర్ స్టేడియం, గ్రీన్‌ఫీల్డ్ స్టేడియం పూర్తిగా పాడైపోయాయి. ఇండోర్ స్టేడియంలోని గదుల ఉన్న తలుపులు, కిటికీలు ఆకతాయిలు ధ్వంసం చేశారు. మందుబాబులు అడ్డాగా మార్చుకున్నారు. రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి జిల్లాకు చెందినవాడే అయినా, ఈ క్రీడా మైదానాన్ని పట్టించుకోకపోవడంపై విద్యార్థులు, క్రీడాకారులు అసంతృప్తి చేస్తున్నారు. కాగా, క్రీడా మైదానాన్ని ఆనుకుని నిర్మించిన గదులను అద్దెకు ఇవ్వడం ద్వారా లభించిన ఆదాయాన్ని కూడా అభివృద్ధికి కేటాయించడంలేదు. దీంతో ప్రస్తుతం ఈ మైదానం మార్నింగ్ వాకర్స్‌కు మాత్రమే ఉపయోగపడుతోంది.

స్పోర్ట్స్ అథారిటీ దృష్టి సారించాలి

రెవెన్యూ డివిజనల్ కేంద్రమైన రాజంపేట పట్టణంలో జాతీయ స్థాయి వాలీబాల్ , షటిల్, బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు ఎంతో మంది ఉన్నారు. అయినా వారికి సరైన తర్ఫీదు లేకపోవడంతో ప్రయోజనం లేకుండా పోయింది. ఉన్నత పాఠశాలలో ఇరువురు ప్రధాన వ్యాయామ ఉపాధ్యాయులు, ఒక కాంట్రాక్టు వ్యాయామ ఉపాధ్యాయుడు ఉన్నా వారి వల్ల ప్రయోజనం చేకూరడంలేదు. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ దీనిపై దృష్టి సారించాల్సి ఉంది.

కరాటే పోటీల్లో కుప్పం క్రీడాకారుల సత్తా..

కడప స్పోర్ట్స్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జెన్ షిటో ర్యూ కరాటే డూ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కడప మునిసిపల్ మైదానంలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన 4వ సౌత్ ఇండియా కరాటే చాంపియన్‌షిప్ క్రీడా పోటీలలో కుప్పం క్రీడాకారులు సత్తా చాటి ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించినట్లు ఏపీ కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోలా ప్రతాప్‌కుమార్ వెల్లడించారు. పోటీలకు నాలుగు రాష్ట్రాల నుంచి దాదాపు 500 మంది క్రీడాకారులు హాజరుకాగా, ప్రారంభోత్సవానికి కడప మునిసిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ రాకేష్ హాజరయ్యారు. అసోసియేషన్ కార్యదర్శి విజయ్ సారథ్యం వహించారు. బీజేపీ, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, బొమ్మన విజయ్, టీఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జా తిరుమలేష్, కడప కరాటే అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ ఎం. విజయ్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

ప్రొద్దుటూరు ,జూలై 20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరా అవుతున్న జియో నెట్‌వర్క్‌కు చెందిన ఇనుప స్తంభాన్ని తాకడంతో ఓ ఆవు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. పట్టణం శాస్త్రినగర్‌లోఆదివారం ఈ సంఘటన చోటుచేసుకోగా, విద్యుత్ అధికారులు గానీ, జియో కంపెనీ అధికారులు గానీ అటు వైపు తొంగి చూడలేదు. స్థానికులు చనిపోయిన ఆవుకు పూజలు చేశారు. జియో నెట్‌వర్క్‌కు చెందిన స్తంభాలు విద్యుత్ విద్యుత్ లైన్లకు సమీపంలో ఉండకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

బంగారు నగలు చోరీ.. కేసు నమోదు

నిమ్మనపల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): బీరువాలో దాచి ఉంచిన బంగారు నగలు అపహరణకు గురయ్యాయని కొండయ్యగారిపల్లికి చెందిన రెడ్డెప్పరెడ్డి, శోభారాణి దంపతులు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ 4 జతల కమ్మలు, చైన్‌లు, ఇతర వస్తువులు కలిపి సుమారు 500 వందల గ్రాములు బంగాలు నగలు చోరీ అయ్యాయని బాధితులు ఫిర్యాదు చేయడంతో సంఘటనా స్థలాన్ని, ఇంటి పరిసర ప్రాంతాలను పరిశీలించామన్నారు. వారం రోజుల క్రితం ఇంటి పనులు చేసేందుకు వచ్చిన ముగ్గురు వ్యక్తులపై బాధితులు అనుమానం వ్యక్తం చేశారన్నారు. క్లూస్ టీమ్‌ను రంగంలోకి దింపి దొంగలను పట్టుకొనేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు.

పట్టపగలే బంగారు అపహరణ

రాజుపాలెం, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని రాజుపాలెం గ్రామంలో శనివారం పట్టపగలు బీరువా పగలగొట్టి ఐదు తులాల బంగారు దోచుకెళ్లినట్లు ఎస్‌ఐ వెంకటరమణ తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు.. ధనిరెడ్డిస సుశ్మిత అనే మహిళ ఇంటిలోని బీరువా పగలగొట్టి మూడు తులాల నల్లపూసల దండ, 2 తులాల గొలుసు దోచుకెళ్లినట్లు తెలిపారు. అదే గ్రామంలో ముందుగా ఒక ఇంటి తాళాలు పగులగొట్టిన దొంగలు అక్కడ ఏమీ లేకపోవడంతో రెండో ఇంటిలో చోరీ చేశారు. తెలిపారు. గత వారంలో కూడా టంగుటూరులో ప్రసాద్ అనే వ్యక్తి ఇంటి తాళాలు పగలగొట్టి బంగారు దోచుకెళ్లనట్లు తెలిపారు.

ఇరువర్గాల ఘర్షణ.. 8 మందిపై కేసు నమోదు

నిమ్మనపల్లి, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఇరువర్గాలు ఘర్షణ పడడంతో 8 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తవళం పంచాయతీ చౌకిళ్లవారి పల్లికి చెందిన కొందరు వ్యక్తులు పబ్లిక్ స్థలంలో గొడవపడి, దాడి చేసుకున్నారన్నారు. ఇరువర్గాలకు చెందిన 8మందిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

రోడ్డు ధ్వంసం చేసినందుకు..

చాపాడు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేసినందుకు మండలంలోని పడమర అనంతపురం గ్రామానికి టీడీపీ నాయకులునందిమండలం మల్లికార్జునరెడ్డి, బాలసుబ్బారెడ్డిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ నెల 19న శనివారం తిప్పిరెడ్డిపల్లె దళితవాడలోని సిమెంటు రోడ్డును వీరు ఎక్స్‌కవేటర్‌తో పగులకొట్టి ధ్వంసం చేశారన్నారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు వీరిపై కేసులు నమోదు చేసినట్లు వారు తెలిపారు.

నిమ్మనపల్లిలో 144 సెక్షన్ అమలు.

నిమ్మనపల్లి, జూలై 20(ఆంధ్రజ్యోతి): నిమ్మనపల్లి మండలంలో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎంపీ మిథున్ రెడ్డిని మద్యం కేసులో శనివారం సిట్ అరెస్ట్ చేయడంతో, ఎలాంటి అల్లర్లు జరగకుండా , ప్రభుత్వ ఆస్తులకు నష్టం వాటిల్లకుండా ముందు జాగ్రత్తగా ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. 144 సెక్షన్‌ను ప్రతి ఒక్కరూ తప్పకుండా పాటించాలని లేని పక్షంలో కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం


టైరు పేలడంతో తుప్పల్లోకి దూసుకెళ్లిన కారు

కొండాపురం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంజిఅనంతపురం సబ్‌స్టేషన్ వద్ద ఆదివారం ప్రొద్దుటూరు నుంచి తాడిపత్రికి వెళుతున్న కారు టైరు పేలిపోయింది. దీంతో కారు రోడ్డు పక్కకు దిగి తుప్పల్లోకి దూసుకుపోయింది. బెలున్‌లు తెరుచుకోవడంతో అందులో ప్రయాణిస్తున్న తండ్రి, కూతుళ్లు సురక్షితంగా బయటపడ్డారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరుగలేదని స్థానికులు తెలిపారు.

మిథున్ అరెస్టుపై రాద్ధాంతం తగదు

- టీడీపీ, జనసేన, బీజేపీ నేతల విమర్శలు


సమావేశంలో మాట్లాడుతున్న తెలుగు యువత అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు, జనసేన నేత రాందాస్‌చౌదరి

మదనపల్లె టౌన్, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఏపీ లిక్కర్ స్కామ్‌లో నిందితుడైన మిథున్‌రెడ్డిని అరెస్టు చేస్తే మదనపల్లె వైసీపీ నేతలు ఉలిక్కిపడి రాద్ధాంతాం చేయడం తగదని తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు విమర్శించారు. ఆదివారం స్థానిక దేవతానగర్‌లోని టీడీపీ పార్లమెంట్ కార్యాలయంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతలు ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లిక్కర్‌స్కామ్ నిందితుడు మిథున్‌రెడ్డి సుప్రీం కోర్టు, హైకోర్టుకు ముందస్తు బెయిల్ కోసం ఎందుకు దరఖాస్తు చేసుకున్నాడన్నారు. వైసీపీ పాలనలో లిక్కర్ కల్తీతో జంగారెడ్డిగూడెంలో 27 మంది మృతి చెందిన విషయం వైసీపీ నేతలు మరచిపోయారా అని ప్రశ్నించారు. రూ.వేలాది కోట్లను హవాలా రూపంలో తరలించారన్నారు. జగన్ కూడా జైలుకు పోయే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ద్వారకనాథరెడ్డి కూడా మదనపల్లె ఫైల్స్ దహనం కేసులో అరెస్టు కాక తప్పదన్నారు. పెద్దిరెడ్డి కుటుంబం భూకబ్జాలకు పాల్పడిన విషయం ప్రజలకు తెలుసన్నారు. మిథున్‌రెడ్డి అరెస్టుపై వైసీపీ నేతలు జైళ్ల గోడలు బద్దలు కొడతామనడం శాంతిభద్రతలకు విఘాతమే అన్నారు. జనసేన రాయలసీమ రీజనల్ కోఆర్డినేటర్ గంగారపు రాందాస్‌చౌదరి మాట్లాడుతూ వైసీపీ పాలనలో మద్యం దుకాణాల వద్ద డిజిటల్ పేమెంట్స్ ఎందుకు అనుమతించలేదన్నారు. నగదుతోనే మద్యం విక్రయించడంలో పరమార్థం ఏమిటన్నారు. మద్యం దుకాణాల నుంచి వచ్చిన సొమ్మంతా తాడేపల్లె ప్యాలెస్‌కు తరలించారన్నారు. వైసీపీ పాలనలో స్కాములు, హత్యలు, జైళ్ల అరాచక పాలన సాగించారన్నారు. జగన్ వ్యక్తిత్వానికి భయపడిన ప్రజలు ఆయనకు కేవలం 11 సీట్లు మాత్రమే ఇచ్చాని గుర్తు చేశారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్ జంగాల శివరాం మాట్లాడుతూ సీఎం చంద్రబాబు చెప్పినట్లు అవినీతిపరులను చెత్త ఊడ్చినట్లు ఊడ్చి వేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు దొరస్వామి నాయుడు, దేవరింటి శ్రీనివాసులు, నాదెళ్ల అరుణ్‌తేజ, మహబూబ్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

నిందితులను పట్టుకోమంటే.. మాపైనే కేసులు పెడతారా?

- బాస్ అధినేత పీటీఎం శివప్రసాద్


శివప్రసాద్ ఇంటికి నోటీసులు అంటిస్తున్న పోలీసులు

మదనపల్లె, జూలై 20(ఆంధ్రజ్యోతి): గుండె జబ్బుతో బాధపడుతున్న తనతోపాటు, నిందితులను పట్టుకోమని డిమాండ్ చేసిన దళిత సంఘాలపై పోలీసులు కేసులు పెట్టి వేధిస్తున్నారని బాస్ అధినేత పీటీఎం శివప్రసాద్ ఆరోపించారు. అంకిశెట్టిపల్లె గుట్టపై వెలసిన గౌతమ బుద్ధుడి తల నరికిన నిందితులను పట్టుకోమంటే, ప్రశ్నించిన దళిత సంఘాల నేతలపై కేసులు పెట్టి వేధించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ కేసును తప్పుదోవ పట్టించేందుకు ఎస్పీ తమపై వేధింపులకు పాల్పడుతున్నాడని శివప్రసాద్ ఆరోపించారు. తాను కోలార్ ఆస్పత్రికి వెళ్లి వచ్చేలోగా తనపై పెట్టిన మూడు తప్పుడు కేసులకు సంబంధించిన నోటీసులు తమ ఇంటికి అంటించి అవమానించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్పీ నన్ను ఏం చేయాలను కుంటున్నాడో తెలియడం లేదని, తాము బుద్ధిస్టులమని, ఎవరినీ ఇబ్బంది పెట్టే వాళ్లం కాదని, అయితే ఇన్ని ఇబ్బందులు పెడుతున్న పోలీసులు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

జర్నలిజం లలితకళల కోర్సుల్లో నేటి నుంచి నేరుగా ప్రవేశాలు

కడప ఎడ్యుకేషన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయంలో పోస్టు గ్రాడ్యుయేషన్ డిప్లమో కోర్సులలో ప్రవేశానికి ఈనెల 21 నుంచి 31 వరకు నేరుగా ప్రవేశాల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ టి.లక్ష్మీప్రసాద్ తెలిపారు. జర్నలిజం శాఖ ఆధ్వర్యంలో పోస్టుగ్రాడ్యుయేషన్ డిప్లమో ఇన్ పబ్లిక్ రిలేషన్ (పీజీడీపీఆర్), పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిప్లమో ఇన్ తెలుగు జర్నలిజం (పీజీడీటీజే), ఫైన్ ఆర్ట్స్ శాఖ ఆధ్వర్యంలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ డిప్లమా ఇన్ థియేటర్ ఆర్ట్స్ కోర్సులకు ప్రవేశాల కౌన్సెలింగ్ జరగనుందన్నారు. పీజీ డిప్లొమా కోర్సులలో ప్రవేశానికి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నారు. కౌన్సెలింగ్‌కు అభ్యర్థులు అన్ని రకాల అర్హత పత్రాలతోనేరుగా యూనివర్సిటీలో హాజరుకావాలని సూచించారు. వివరాలకు యోగివేమన విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.వైవీయు.ఇడియు.ఇన్ ను సందర్శించాలని సూచించారు.

బైకును ఢీకొన్న లారీ .. ఒకరికి తీవ్రగాయాలు

ముద్దనూరు జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామం వద్ద శనివారం రాత్రి బైకును లారీ ఢీకొనడంతో రవిశంకర్ అనే వ్యక్తికి తీవ్రగాయలైనట్లు ఎస్‌ఐ మైనుద్దీన్ తెలిపారు. పులివెందులకు చెందిన రవిశంకర్ ఎర్రగుంట్ల వైపు నుంచి బైకుపై పులివెందులకు వెళుతుండగా, అదే వైపు వెళుతున్న లారీ తిమ్మాపురం స్పీడ్ బ్రేకర్ వద్ద ఢీకొనడంతోపాటు బైక్‌ను కొంతదూరం లాక్కొని వెళ్లింది. దీంతో రవిశంకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. విషయం గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని వెంటనే 108 వాహనంలో ప్రొద్దుటూరులోని ప్రభుత్వ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సలహా మేరకు హైదరాబాదుకు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

11 మంది జూదరుల అరెస్టు

- రూ.1.45లక్షలు, బైక్‌లు, కార్లు స్వాధీనం

చక్రాయపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సమీపంలో పేకాట ఆడుతున్న 11 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ. 1,45,100 స్వాధీనంచేసుకున్నట్లు సీఐ ఉలసయ్య తెలిపారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ చక్రాయపేటకు తూర్పు దిక్కున 3 కిలోమీటర్ల దూరంలో మల్లెపల్లె రాజశేఖర్‌కు చెందిన నిమ్మతోటలో నిర్వహిస్తున్న పేకాట కేంద్రంపై ఆదివారం దాడులు చేశామన్నారు. 11 మందిని అరెస్టు చేసుకొని, రూ. 1,45,100 నగదు, 11 మొబైల్ ఫోన్లు, 4 మోటార్ సైకిళ్లు, రెండు కార్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ రంగారావు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వామి, అమ్మవార్లకు ఘనంగా పూజలు, బోనాలు





సిద్దవటం: రామచెల్లెమ్మకు బోనాలు తెచ్చిన భక్తులు... చిట్వేలి: ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్య స్వామి... పుల్లంపేట: అలంకరణలో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి

సిద్దవటం, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : స్వామి, అమ్మవార్లకు ఆదివారం పలు ప్రాంతాల్లో భక్తులు పూజలు, బోనాలు సమర్పించారు. సిద్దవటం పరిధిలోని మందపల్లె గ్రామంలో వెలసిన పురాతనమైన గ్రామదేవత రామ చెల్లెమ్మ అమ్మవారికి స్థానికులు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి పూజలు నిర్వహించారు. మొదట గ్రామదేవత నడివీధి గంగమ్మ అమ్మవారికి పూజలు అనంతరం కాలినడకన నడుచుకుంటూ మందపల్లె గ్రామ సమీపాన వెలసిన రామ చెల్లెమ్మ అమ్మవారికి కుంకుమార్చన, ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ రామచెల్లెమ్మ అమ్మవారికి బోనాలు సమర్పిస్తే సకాలంలో వర్షాలు కురుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీనివాసులునాయుడు, సర్పంచ్ తుర్రా చిన్నక్క, సర్పంచ్ ప్రతినిధి ప్రతాప్‌నాయుడు, ఉపసర్పంచ్ ప్రతినిధి నరసింహారెడ్డి, ఆ ప్రాంత మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం

పుల్లంపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పర్వతవర్దినిదేవి శాంతిలింగేశ్వరస్వామి ఆలయంలో ఆడికృతిక పర్వదినం సందర్భంగా శ్రీవల్లి దేవసేన సుబ్రహ్మణ్యంస్వామి కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయంలోని కల్యాణ మండపంలో వివిధ రకాల పూలతో కల్యాణ మండపాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం శ్రీవల్లి దేవసేన సుబ్రహ్మణ్యస్వామి ఉత్సవ విగ్రహాలను అలంకరించి కల్యాణవేదికపైకి తీసుకువచ్చారు. వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణాన్ని కనులారా వీక్షించారు. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ కూడా చేశారు. సాయంత్రం స్వామివార్లకు అంగరంగ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

నందలూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ అరవపల్లెలో వెలసిన కోదండరామ స్వామి దేవాలయంలో ఆదివారం సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. అర్చకుడు సరసా రవికుమార్‌శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రాల, భక్తుల గోవిందనామస్మరణల మధ్య కల్యాణం కన్నులపండువగా సాగింది. 41 రోజుల పాటు మండల పూజ మహోత్సవాల్లో భాగంగా హోమం, నవగ్రహ శాంతి, మూలవిరాట్‌కు అభిషేకం, సంప్రోక్షణ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చివరిరోజు కల్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు పెద్దఎత్తున అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్త గంపా సుధాకర్, కార్యక్రమాల నిర్వాహకులు నడివీధి సుధాకర్, నారపుశెట్టి శివయ్య, నారపుశెట్టి వేణు, మహేష్, ఆకుల చలపతి, రైల్వే అధికారి రవికుమార్, దుశ్వంత్, కలిశెట్టి సాయి, భక్తులు పాల్గొన్నారు.

భుజంగేశ్వర స్వామికి పూజలు

రైల్వేకోడూరు రూరల్, జూలై 20(ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు పట్టణంలోని భుజంగేశ్వర స్వామి ఆలయంలో వెలసిన సుబ్రహ్మణ్య స్వామికి ఆడి కృత్తిక సందర్భంగా భక్తులు ఆదివారం పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు యోగి శర్మ ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్యం స్వామి పాలాభిషేకం చేసి, ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

అభయాంజనేయ స్వామికి పూజలు

రాజంపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట పట్టణం వైబీఎన్ పల్లెలో వెలసిన అభయాంజనేయస్వామి దేవస్థానంలో ఆదివారం ఆడికృతిక సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు అప్పలాచారి, శేషాద్రిస్వాముల వేదమంత్రాల మధ్య ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

చిట్వేలిలో...

ఆడికృత్తిక సందర్భంగా శ్యామలాంబ సమేత సోమేశ్వరస్వామి ఆలయం, పాత చిట్వేలిలోని భద్రకాళి సమేత వీరభద్ర ఆలయం, అమ్మవారిశాలలో ఆడి కృత్తికను ఘనంగా నిర్వహించారు. వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామికి పంచామృతాభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిశాలలో స్వామికి కల్యాణాన్ని కన్నులపండుగగా నిర్వహించారు. స్వామి వారికి గ్రామోత్సం నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యాన్ని కల్పించారు.

లిక్కర్ స్కాంలో దోచుకున్న వైసీపీ

- రాజకీయ కుట్ర అనడం తగదు
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు చమర్తి




సిద్దవటం: మాట్లాడుతున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు... రాజంపేట: మాట్లాడుతున్న బీజేపీ నేత పోతుగుంట రమేష్‌నాయుడు

సిద్దవటం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): లిక్కర్ స్కాంలో దోచుకున్న వైసీపీ రాజకీయ కుట్ర అనడం తగదని టీడీపీ జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. భాకరాపేట గ్రామంలో ఆదివారం రాత్రి సర్పంచ్ తుర్రా చిన్నక్క స్వగ్రామంలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో మద్యం స్కాం ద్వారా ప్రజల సొమ్ము కోట్ల రూపాయలు దండుకున్నట్లు అధికారులు దర్యాప్తు చేసి పలువురిని అరెస్ట్ చేశారన్నారు. ఈ విచారణలో భాగంగా రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని పక్కా ఆధారాలతో అరెస్ట్ చేశారని, అయితే ఓ పత్రిక పనికట్టుకుని రాజకీయ కుట్రతో కూటమి ప్రభుత్వం వేధిస్తుందని చెప్పడం ప్రజలను తప్పుదోవ పట్టించడమే నన్నారు. మిథున్‌రెడ్డి అరెస్ట్ రాజకీయ కుట్రకోణం కాదని, కూటమి ప్రభుత్వం ఎవరిపై కక్ష సాధింపు చర్యలు చేపట్టదన్నారు. మద్యం స్కాంలో తప్పు చేసిన వారు ఎవరూ తప్పించుకోలేరన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దవటం, ఒంటిమిట్ట టీడీపీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

'రాజంపేట పార్లమెంట్ ఎంపీగా ఏం చేశారు మిథున్'

రాజంపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : 'రాజంపేట పార్లమెంట్ సభ్యుడిగా మూడు సార్లు ఎన్నికైన పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డీ.. మీరు ఈ పార్లమెంట్‌కు ఏమి చేశారని టీడీపీ లీగల్‌సెల్ అధ్యక్షుడు తరిగోపుల లక్ష్మీనారాయణ, టీడీపీ నేతలు ప్రశ్నించారు.ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజంపేట పార్లమెంట్ ప్రజలు మూడు సార్లు పార్లమెంట్ సభ్యులుగా ఎన్నుకున్నా ఏ రోజు అభివృద్ధి గురించి పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. అక్రమంగా ఆదాయ మార్గాలను ఎంచుకున్నారన్నారు. రాష్ట్రంలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి తర్వాత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన తనయుడు మిథున్‌రెడ్డిలే చక్రం తిప్పారన్నారు. ఇసుకను బెంగుళూరు, చెన్నైలకు తరలించి రూ.వేల కోట్లు ఆర్జించారని ఆరోపించారు. సొంత మద్యం కంపెనీలను ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడి వేల కోట్లు వెనుకేసుకున్నారన్నారు. ఆ అక్రమ డబ్బుతోనే రాజంపేట పార్లమెంట్ ఎన్నికల్లో డబ్బు, మద్యాన్ని ఏరులా పారించారన్నారు. రాజంపేట పార్లమెంట్ ఎంపీలుగా సాయిప్రతాప్, గునిపాటి రామయ్య, పాలకొండ్రాయుడులు ఎంతోమంది ఈ ప్రాంత అభివృద్ధి కోసం పాటుపడ్డారు కానీ మీరు ఏమీ చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు సంజీవరావు, షామీర్‌బాషా, బాసినేని వెంకటేష్‌నాయుడు, నాగేశ్వర్‌రావునాయుడు, చంద్ర, సుధాకర్, తలిశెట్టి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దేశంలోనే అతిపెద్ద లిక్కర్ స్కాం :బీజేపీ

రాజంపేట టౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే అతిపెద్ద లిక్కర్‌స్కాంగా మన రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వంలో వేల కోట్ల రూపాయలు ప్రజాధనాన్ని దోపిడీ చేశారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు తెలిపారు. ఆదివారం బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి దేశంలోనే అతిపెద్ద మద్యం కుంభకోణంలో భాగమయ్యారని, అక్కడ ఆయన ఎక్సైజ్ విధానాలను తారుమారు చేసి మద్యం ఆటోమెటిక్ ఆర్డర్ ప్లేస్‌మెంట్ వ్యవస్థను మార్చారని ఆరోపించారు. వేలాది మంది అమాయక ప్రజల జీవితాలను నాశనం చేసిన మద్యం కుంభకోణంలో భాగమైన వారందరిని న్యాయస్థానం ముందు నిలబెట్టడానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి పట్టుపోగుల ఆదినారాయణ, మండల ఉపాధ్యక్షుడు రేణుప్రసాద్‌రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి ఎం.గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంను, మంత్రిని విమర్శించడం రమేశ్‌కుమార్‌రెడ్డికి తగదు

సంబేపల్లె, జూలై20(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చూసి ఓర్వలేక మాజీ ఎమ్మెల్యే రమేశ్‌కుమార్‌రెడ్డి రాష్ట్రల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర రాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని విమర్శించడం తగదని తెలుగు యువత, రాజంపేట పార్లమెంట్ కార్యదర్శి పుత్తూరు అశోక్ తెలిపారు. చిన్నమండెం మండలంలో జరిగిన వైసీపీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి, మంత్రిని విమర్శించి మాట్లాడం సరికాదన్నారు. ఏడాది పాలనలో అభివృద్ధిని చూడలేక మా నాయకులు పైన నిందలు మోపడం మంచి పద్దతి కాదన్నారు. తెలుగుదేశం పార్టీలో ఉంటూ ఎన్నికల ముందు మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మోచేతి నీళ్లు తాగి ఈ రోజు మా నాయకులపైన నిందలు వేయడం మంచి పద్దతి కాదన్నారు. మా ప్రభుత్వంపై ఆ నాయకులపై అక్రమ ఆరోపణలు అవాస్తవాలు మాట్లాడితే మరోమారు సరికాదని హెచ్చరించారు.

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఆనందగజపతిరాజు



ఆనంద గజపతిరాజు

రాయచోటిటౌన్, జూలై20(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ అన్నమయ్య జిల్లా కార్యదర్శిగా ఆనందజగపతిరాజును నియమిస్తూ ఆదివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్ నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు.

ఈ సందర్భంగా బీజేపీ నాయకులు చింతల ప్రసన్నరాములు, ఏపీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసయాదవ్ ఆనందగజపతిరాజును సన్మానించారు.ఈ సందర్భంగా ఆనందగజపతిరాజు మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా కార్యదర్శి బాధ్యత అప్పగించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే జిల్లాతో పాటు అన్ని నియోజకవర్గాల్లో బీజేపీని పటిష్ఠ పరుస్తామన్నారు. ప్రస్తుత ఎన్డీఏ కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పేద ప్రజలకు అందేలా కృషి చేస్తానన్నారు.

కార్మికులకు జీతాలు రూ.21 వేలకు పెంచాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు




సమ్మెలో పాల్గొన్న ఇంజనీరింగ్ కార్మికులు

రాయచోటిటౌన్, జూలై20(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు జీతాలు రూ.21 వేలకు పెంచాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్బవరం రామాంజులు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు వారం రోజులుగా చేస్తున్న సమ్మెలో భాగంగా ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బీవీ రమణ, జిల్లా కోశాధికారి రాంబాబు, వాటర్ సెక్షన్ విభాగపు అధ్యక్షులు అక్బర్, గౌరవాధ్యక్షుడు శంకరయ్య ఆధ్వర్యంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికులకు రూ.21 వేలకు జీతాలు పెంచాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, పారిశుధ్య వాహన డ్రైవర్లకు రూ.24,500 వేతనం అమలు చేయాలని, టీఎల్ఎఫ్ ద్వారా ఇవ్వాల్సిన 8 నెలల పెండింగ్ పీఎఫ్ బకాయిలు విడుదల చేయాలని కోరారు. అంతేగాక అప్కాస్‌ను తిరిగి కొనసాగించి పని గంటల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. అలాగే రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్ 5 లక్షలతో పాటు వయో పరిమితి 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మికులు మంగమ్మ, రమాదేవి, మల్లికార్జున, రమణారెడ్డి, ప్రసాద్, గంగులయ్య, కృష్ణారెడ్డి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐదో రోజుకు చేరుకున్న మున్సిపల్ కార్మికుల సమ్మె

రాజంపేట టౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని రాజంపేట మున్సిపల్ కార్యాలయం వద్ద కొనసాగిస్తున్న సమ్మె ఆదివారం ఐదోరోజుకు చేరుకుంది. ఇంతవరకు ప్రభుత్వం కనీసం చర్చలకు కూడా పిలవలేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని ప్రభుత్వ రంగాల్లో కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేసి రెగ్యులర్ చేయాలని ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీహరి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఓబయ్యప్రసాద్, బుజ్జమ్మ, సాలయ్య, రవిశంకర్, అచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

మందుల షాపు యజమానిపై దాడి



గాయపడిన రెడ్డివరప్రసాద్

రాయచోటిటౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని కొత్తపేటలో గల జనరిక్ మందుల షాపు యజమాని మల్లూరు రెడ్డివరప్రసాద్‌పై ఆదివారం రాత్రి సుమారు 8గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. మందులు కావాలంటూ షాపు వద్దకు వచ్చిన వారు మందులు ఇచ్చేందుకు కిందికి వంగిన రెడ్డివరప్రసాద్‌పై ఒక్క సారిగా షాపు షెట్టర్ దించి దాడికి పాల్పడి అక్కడి నుంచి వెళ్లారు. దాడిలో తీవ్రంగా గాయపడిన రెడ్డివరప్రసాద్‌ను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. దాడి విషయం తెలిసిన టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్ బాబు ఆస్పత్రికి చేరుకుని దాడి విషయమై ఆరా తీశారు. బాధితుడిని పరామర్శించారు. రెడ్డివరప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ పోలీసులు తెలిపారు.

మైనార్టీలకు అండగా ఉంటాం: ముక్కా



ముస్లిం మతపెద్దలతో మాట్లాడుతున్న ముక్కారూపానందరెడ్డి

రైల్వేకోడూరు రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మైనారిటీలకు అండగా ఉంటామని కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని కొత్తకోడూరులో ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్‌తో కలిసి సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ఏడాదిలో చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. కొత్త కోడూరులో ఉన్న మజీద్ నిర్మాణంలో జా ప్యం జరుగుతుందని, ప్రజా ప్రతినిధులు సహకరించాలని స్థానిక ముస్లిం మత పెద్దలు ముక్కాకు వివరించారు. స్థానిక అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తానని ముక్కా హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిత్యం ప్రజా సంక్షేమం కోసమే తపన పడుతున్నారన్నారు. సీనియర్ మైనార్టీ టీడీపీ నాయకుడు పఠాన్ మౌలా, వార్డు సభ్యులు పోతురాజు నవీన్, నార్జాల హేమరాజ్, తల్లెం వెంకటరమణారెడ్డి, బత్తిన వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మానవతా సంస్థలో భాగస్వాములు కావాలి

సుండుపల్లె, జూలై20(ఆంధ్రజ్యోతి): మానవతా సంస్థ చేస్తున్న సేవలను ఆదర్శంగా తీసుకొని పలువురు భాగస్వాములు కావాలని టీడీపీ ఎన్నారై నాయకుడు, బాడీ ఫ్రీజర్ దాత బాలాజీనాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం సుండుపల్లె మండల కేంద్రంలో మానవతా సంస్థ నూతన కమిటీ ఏర్పాటు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మానవతా సంస్థ సభ్యుడు ఆయన్ను ఘనంగా సన్మానించారు. మానవతా అధ్యక్షుడిగా లక్ష్మయ్యనాయుడు, ఉపాధ్యక్షుడిగా సుబ్రమణ్యం, ప్రధాన కార్యదర్శిగా అమృనాయక్, ఆర్థిక కార్యదర్శిగా నరసింహులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీకి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. మానవతా కో కన్వీనర్ నాగేశ్వరరావు, ఎంఈవో రవీంద్రనాయక్, ప్రధానోపాధ్యాయుడు నాగరాజునాయక్, జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందరెడ్డి, హరికుమార్, శివకుమార్‌నాయుడు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులతో టీడీపీ ప్రతిష్ట దిగజారిపోతోంది

- రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమర్‌నాథ్‌రెడ్డి

రాజంపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన యేడాదిలోనే ప్రతిపక్ష వైసీపీ నేతలపై అక్రమ అరెస్టులు నిర్వహిస్తూ తన ప్రతిష్టను దిగజార్చుకుంటున్నారని ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రాజంపేటలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎటువంటి తప్పు చేయని ఎంపీ మథున్‌రెడ్డిని తప్పుడు కేసులు పెట్టి అరెస్ట్ చేయడం దారుణమన్నారు. సూపర్‌సిక్స్ పేరిట అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తామని అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభివృద్ధిని మరచారన్నారు. అక్రమ అరెస్ట్ వల్ల కూటమి ప్రభుత్వం ప్రజల్లో పలచపడుతుందన్నారు. ఇప్పటికైనా అరెస్టులు మానుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చొప్పా యల్లారెడ్డి, మహిళా నేత మిరియాల సురేఖ పాల్గొన్నారు.

'కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి'



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రమేశ్‌రెడ్డి

సంబేపల్లె, జూలై20 (ఆంధ్ర జ్యోతి): కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని మాజీ ఎమ్మెల్యే రమేశ్‌కుమార్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ సుగవాసి బాలసుబ్రమణ్యం, మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సంబేపల్లె మండల కేంద్రంలో స్థానిక నాయకులు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు చిదంబర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ గొర్ల ఉపేంద్రారెడ్డితో కలిసి సమావేశం నిర్వహించారు. ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు అక్రమంటూ ఖండించారు.

కదిరివాండ్లపల్లెలో విస్తృతస్థాయి సమావేశం

చిన్నమండెం, జూలై20(ఆంధ్రజ్యోతి): మండలంలోని మండల గ్రామ, పంచాయతీ కదిరివాండ్లపల్లెలో వైసీపీ నేతలు ఆదివారం విస్తృతస్థాయి సమావేశం నిర్వహించింది. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు శ్రీకాంత్‌రెడ్డి, రమేశ్‌కమార్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ బాలసుబ్రమణ్యం, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి పాల్గొని కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై ప్రజలకు వివరించారు. చంద్రబాబు ఇచ్చిన హామీలను పరితగతన అమలు పరచాలని వారు డిమాడ్ చేశారు.

బోల్తాపడ్డ లారీ- తప్పిన పెను ప్రమాదం

చిన్నమండెం, జూలై20(ఆంధ్రజ్యోతి):మండలంలోని జాతీయ కడప- బెంగుళూరు జాతీయ రహదారిపై వండాడి వద్ద లారీ బోల్తా పడి అదృష్టం ఎలాంటి ప్రమాదం జరగలేదు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... రాయచోటివైపు నుంచి వస్తున్న బోల్తాపడడంతో గుర్రంకొండ మండలానికి చెందిన లారీ డ్రైవర్ కంశెట్టి, రెడ్డెప్పకు స్వల్ప గాయాలవ్వడంతో 108 వాహనంల రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

హక్కులు అడిగితే ఉగ్రవాదులు అంటారా : సీపీఐ



మాట్లాడుతున్న గుజ్జల ఈశ్వరయ్య

రైల్వేకోడూరు రూరల్, జూలై 20(ఆంధ్రజ్యోతి): ప్రజాహక్కులను కాపాడుకోవాలని పోరాటాలు చేస్తున్న వారిని ఉగ్రవాదులు అంటారా అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం రైల్వేకోడూరు పట్టణంలో సీపీఐ మహాసభలను నిర్వహించారు. టోల్‌గేట్ నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సభలో ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకోవాలని పోరాటాలు చేస్తుంటే తమ పార్టీపై ఉగ్రవాదులు అనే ముద్ర వేయడం దారుణమన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా రెండు కోట్ల మందికి ఉద్యోగాలు ఇస్తామని ఇచ్చిన హామీ నీటిమూటగా మారిందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పి.ఎల్.నరసింహులు, సహాయ కార్యదర్శి పి.మహేష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు టి.రాధాక్రిష్ణ, ఎం.శివరామక్రిష్ణ దేవర, రైతు సంఘం సీనియర్ నేత మలిశెట్టి రాహుల్, పాల్గొన్నారు.

'తాగునీటి సమస్యను పరిష్కరించాం'

లక్కిరెడ్డిపల్లె, జూలై20(ఆంధ్రజ్యోతి): రామాపురం, లక్కిరెడ్డిపల్లె మడలాల్లో రూ.70 లక్షలతో తాగునీటి సమస్య పరిష్కరించామని రాష్ట్ర యువజన, క్రీడాశాఖ మంత్రి సోదరుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం లక్కిరెడ్డిపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయలేని విధంగా ఈ రెండు మండలాల్లో ప్రతి గ్రామానికి సీసీ రోడ్లు, తారు రోడ్లు, తాగునీటి సమస్య తీర్చిన ఘనత మండిపల్లి కుటుంబానిదేనన్నారు. టీడీపీ మండల ఇన్‌చార్జి మదన్‌మోహన్, మాజీ జెడ్పీటీసీ రెడ్డెయ్య, మార్కెట్ యార్డు చైర్మన్ డాక్టర్ షఫీనాయక్ పాల్గొన్నారు.

'విద్యుత్ సంస్థ అధికారులపై సమగ్ర విచారణ చేపట్టాలి'

రాయచోటిటౌన్, జూలై20(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న అధికారులపై కలెక్టర్ ఆధ్వర్యంలో అవినీతి నిరోధకశాఖ అధికారులు, విద్యుత్ సంస్థ ఆధ్వర్యంలోని విజిలెన్స్ అధికారులు కలిసి సమగ్రంగా విచారణ జరిపితే నిజనిజాలు వెలుగులోకి వస్తాయని బీజేపీ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి, సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వశాఖ విశ్వకర్మ యోజన జిల్లా ఇంప్లిమెంటేషన్ కమిటీ సభ్యుడు చీర్ల శ్రీనివాస్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇటీవల వ్యవసాయ, గృహ అవసరాలు, విద్యుత్ కనెక్షన్లు కోసం దరఖాస్తు చేసుకున్న వారికి కూడా సకాలంలో కనెక్షన్లు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టినట్లు తెలుస్తోందన్నారు.

నిరుపయోగంగా ఉన్న ఇండోర్ స్టేడియం



రూ.220 కోట్ల ఆస్తి..
ప్రయోజనం నాస్తి..

- నిరుపయోగంగా 20 ఎకరాల క్రీడా మైదానం
- నిర్వహణ లేక పెరిగిన ముళ్ల పొదలు
- జాతీయ స్థాయి క్రీడాకారులున్నా.. శిక్షణకు అవకాశం సున్నా..

రాజంపేట పార్లమెంటు నియోజకవర్గ కేంద్రంలో వందలాది కోట్ల రూపాయల విలువ చేసే మైదానం రాజంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం. రాజంపేట - రాయచోటి రోడ్డులో ఫ్లైఓవర్ బ్రిడ్జి ఆనుకుని సుమారు 20 ఎకరాల్లో ఈ క్రీడా మైదానం ఉంది. ఇక్కడ సెంటు రమారమి 50 లక్షలు ఉంటుంది. లోపలి భాగంలో కూడా సరాసరి రూ. 20 లక్షల నుంచి రూ.30 లక్షలు ఉంటుంది. ఈ మొత్తం ఆస్తి విలువ రూ.200 కోట్లకు పైబడే. సుమారు 80 వేల జనాభా కలిగిన రాజంపేట పట్టణంలో ఉన్న ఈ క్రీడా మైదానాన్ని ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలల విద్యార్థులు వినియోగించుకుంటున్నారు.

రాజంపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు క్రీడల్లో తర్ఫీదునిచ్చి ఉత్తమ క్రీడాకారులుగా తీర్చి దిద్దేందుకు పలువురు దాతలు 20 ఎకరాల సువిశాల స్థలాన్ని విరాళంగా ఇచ్చారు. ప్రభుత్వం ఆ స్థలం చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించింది. పట్టణంతోపాటు, చుట్టుపక్కల గ్రామాల్లో ఉన్న పాఠశాలలు, జిల్లా, రాష్ట్ర స్థాయికి చెందిన క్రీడా పోటీలు నిర్వహించాలంటే ఈ క్రీడా మైదానంలో నిర్వహించాల్సిందే. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ ఆర్ లాంటి పలువురు ప్రముఖ నేతల బహిరంగ సభలు కూడా ఈ మైదానంలోనే నిర్వహించారు. అ టువంటి ఈ క్రీడా మైదానంపై ప్రభుత్వం నిర్లక్ష్యం చూపు తోంది. కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రి గా ఉన్న సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా క్రీడలకు అధిక ప్రా ధాన్యమిచ్చారు.

> **సౌకర్యాలు కల్పించాలి**
>
> 
>
> రాజంపేట క్రీడా మైదానంలో సౌకర్యాలను కల్పిస్తే స్థానిక క్రీడాకారులు ఉన్నత స్థాయికి చేరుకుంటారు. ఇప్పుడున్న ఇండోర్, గ్రీన్‌ఫీల్డ్ స్టేడియాలను అభివృద్ధి చేయాలి. క్రీడా మైదానంలో కనీస సౌకర్యాలను కల్పించడంతోపాటు, నిర్వహణకు ప్రత్యేక సిబ్బందిని నియమించాలి.
>
> - షామీర్‌బాషా, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు

అందులో భా గంగా రాజంపేట క్రీడా మైదానంలో ఇండోర్ స్టేడియాన్ని, గ్రీన్‌ఫీల్డ్ స్టేడియాన్ని ఏర్పా టు చేశారు. దీంతో ఈ క్రీడా మైదానానికి ఎంతో ప్రాముఖ్యత వచ్చింది. ఈ స్టేడియాల్లో బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, జిమ్, అథ్లెటిక్స్ లాంగ్‌జంప్, క్రికెట్ పోటీలు నిర్వహిస్తుండేవారు. రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లు కూడా నిర్వహించారు.

క్రీడా ప్రాంగణంలోనే సబ్‌స్టేషన్

గత పాలకులు పట్టించుకోకపోవడంతో క్రీడా మైదానం ప్రాంగణంలో ఓ వైపున సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. దీంతో జానీబాషాపురం ఆనుకుని ఉన్న సుమారు 3 ఎకరాల పైబడి క్రీడా మైదానం కంపచెట్లకు నిలయంగా మారింది. ఈ ప్రాంతంలో ఏదైనా స్టేడియాన్ని ఏర్పాటు చేస్తే అందరికి ఉపకరించేది. ఆ ఖాళీ ప్రాంతాన్ని పట్టించుకోకపోవడంతో కంప చెట్లు బాగా ఏపుగా పెరిగి విషసర్పాలు తిరుగుతూ, పందుల నివాసానికి ఉపయోగపడుతోంది. ఇక క్రీడా మైదానంలో వాకర్స్ అసోసియేషన్ పాదచారులు నడవడానికి ట్రాక్ ఏర్పాటు చేసింది. ప్రభుత్వం ద్వారా కొన్ని ట్రాక్‌లు ఏర్పాటు చేసినా నాణ్యత లోపం కారణంగా ఉపయోగంలో లేవు.

ఆగిపోయిన అభివృద్ధి

ప్రస్తుతం ఇండోర్ స్టేడియం, గ్రీన్‌ఫీల్డ్ స్టేడియం పూర్తిగా పాడైపోయాయి. ఇండోర్ స్టేడియంలోని గదుల ఉన్న తలుపులు, కిటికీలు ఆకతాయిలు ధ్వంసం చేశారు. మందుబాబులు అడ్డాగా మార్చుకున్నారు. రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి జిల్లాకు చెందినవాడే అయినా, ఈ క్రీడా మైదానాన్ని పట్టించుకోకపోవడంపై విద్యార్థులు, క్రీడాకారులు అసంతృప్తి చేస్తున్నారు. కాగా, క్రీడా మైదానాన్ని ఆనుకుని నిర్మించిన గదులను అద్దెకు ఇవ్వడం ద్వారా లభించిన ఆదాయాన్ని కూడా అభివృద్ధికి కేటాయించడంలేదు. దీంతో ప్రస్తుతం ఈ మైదానం మార్నింగ్ వాకర్స్‌కు మాత్రమే ఉపయోగపడుతోంది.

స్పోర్ట్స్ అథారిటీ దృష్టి సారించాలి

రెవెన్యూ డివిజనల్ కేంద్రమైన రాజంపేట పట్టణంలో జాతీయ స్థాయి వాలీబాల్ , షటిల్, బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు ఎంతో మంది ఉన్నారు. అయినా వారికి సరైన తర్ఫీదు లేకపోవడంతో ప్రయోజనం లేకుండా పోయింది. ఉన్నత పాఠశాలలో ఇరువురు ప్రధాన వ్యాయామ ఉపాధ్యాయులు, ఒక కాం ట్రాక్టు వ్యాయామ ఉపాధ్యాయుడు ఉన్నా వారి వల్ల ప్రయోజనం చేకూరడంలేదు. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ దీనిపై దృష్టి సారించాల్సి ఉంది.



మందుబాబులకు అడ్డాగా మారిన గ్రీన్‌ఫీల్డ్ స్టేడియం


క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన సబ్‌స్టేషన్


క్రీడా మైదానంలో పరిచిన కంకర

దొరికినోళ్లకు.. దొరికినంత!

- బుక్‌స్టాల్ భవనం కూల్చివేత
- సామగ్రి ఎత్తుకెళ్లిన స్థానికులు


కూల్చివేసిన భవనం ముందు గుమిగూడిన స్థానికులు

మదనపల్లె, జూలై20 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపైన వెళుతున్న వాహనాలు బోల్తాపడి నపుడు వాటిలో తరలుతున్న సరుకులు రోడ్డుపై పడి పోతుంటాయి. అటుగా వెళ తున్న వాహనదారులు, ప్రయాణికులు, స్థానికులు వా టిని పోటాపోటీగా ఎగబడి తీసుకెళుతుంటారు. ఇలాంటి సంఘటనే మదనపల్లి పట్టణంలోని నెహ్రూ వీధిలో ఆదివారం రాత్రి దర్శనమిచ్చింది. అయితే, ఇక్కడ ప్రమాదం కాదు కానీ, ఇద్దరి మధ్య ఏర్పడిన వివాదం ఇందుకు కారణమైంది. స్థానిక నెహ్రూ వీధిలో ఓ వ్యక్తి కొన్నేళ్లుగా బుక్‌స్టాల్ నడుపుతున్నాడు. ఈ స్టాల్ ఉన్న స్థలంయజమానికి, బుక్‌స్టాల్ యజమాని మధ్య కొన్నేళ్లుగా కోర్టులో వివాదం నడుస్తోంది. ఆదివారం రాత్రి ఓ ప్రైవేటు పాఠశాల యాజమాన్యం ఎక్స్‌కవేటర్‌తో బుక్‌స్టాల్ భవనాన్ని కూల్చివేసింది. కోర్టు ఆదేశాలతోనే భవనాన్ని కూల్చివేసినట్లు స్థానికులు చెబుతున్నారు. దుకాణంలోని సరుకును బయటికి తీయకుండానే భవనాన్ని కూల్చివేయడంతో అటుగా వెళుతున్న స్థానికులు లోపలికి ప్రవేశించి ఎవరికి దొరికింది వారు ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో ఎత్తుకెళ్లారు. ఈ విషయం వ్యాపించడంతో పెద్ద ఎత్తున స్థానికులు అక్కడికి చేరుకున్నారు. శిథిలాల్లోకి పెద్దలు ప్రవేశించడానికి వీలు లేకపోతే పిల్లలను లోపలికి పంపి సామగ్రిని తీసుకెళ్లారు. దుకాణంలో రూ.10 లక్షల నుంచి రూ.12 లక్షల విలు వైన సరుకు ఉందని దుకాణ యజమాని ఆవేదన వ్యక్తం చేశాడు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): భార్య గొడవపడి వెళ్లిపోయిందని మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన కురుబకోట మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు మండలంలోని తెట్టు గ్రామం, నక్కనేపల్లెకు చెందిన జగన్నాథ్ (35) నాలుగు రోజుల క్రితం తన భార్య సుజాతతో గొడవపడ్డాడు. దీంతో ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెందిన అతను ఆదివారం పురుగుల మందుతాగాడు. కుటుంబసభ్యులు అతనిని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, ప్రథమ చికిత్స అనంతరం డాక్టర్లు తిరుపతికి రెఫర్ చేశారు. కేసు నమోదు చేసినట్లు ముదివేడు పోలీసులు తెలిపారు.

పాముకాటుతో వ్యక్తికి అస్వస్థత

మదనపల్లె అర్బన్, జూలై 20(ఆంధ్రజ్యోతి): పొలం పనులు చేస్తుండగా ఓ వ్యక్తిని పాము కరవడంతో మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అవుట్‌పోస్టు పోలీసులు కథనం మేరకు మదనపల్లె మండలం, వేంపల్లె కు చెందిన గంగులయ్య కుమారుడు సుబ్రమణ్యం (45) పొలం పనులు చేస్తుండగా పాముకాటుకు గురయ్యాడు. దీంతో అస్వస్తతకు గురైన అతనిని గమనించిన కుటుంబసభ్యులు అతనిని వెంటనే మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు.

కూతురు అదృశ్యం.. తండ్రి ఫిర్యాదు

బి.కొత్తకోట, జూలై 20(ఆంధ్రజ్యోతి): తన కూతురు అదృశ్యమైందంటూ ఓ తండ్రి ఫిర్యాదు చేసినట్టు బి.కొత్తకోట సీఐ జీవన్ గంగనాథ్ బాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు... పట్టణంలోని బీసీ కాలనీలో నివాసం ఉంటున్న ముండ్ల వెంకటాద్రికి ఇద్దరు కూతుళ్లు, ఓ కుమారుడు వున్నారు. వీరిలో చిన్న కుమార్తె మేఘన(19) పట్టణంలోని ఓ కాలేజిలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈ నెల 19న కాలేజి నుంచి ఇంటికి తిరిగొచ్చాక ఫోన్‌లో మాట్లాడుతుండడంతో తండ్రి వెంకటాద్రి మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన యువతి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో గాలించినా ఫలితం కనిపించకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు. కేసు దర్యాప్తు చేస్తు న్నట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

ప్రొద్దుటూరు ,జూలై 20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరా అవుతున్న జియో నెట్‌వర్క్‌కు చెందిన ఇనుప స్తంభాన్ని తాకడంతో ఓ ఆవు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. పట్టణం శాస్త్రినగర్‌లోఆదివారం ఈ సంఘటన చోటుచేసుకోగా, విద్యుత్ అధికారులు గానీ, జియో కంపెనీ అధికారులు గానీ అటు వైపు తొంగి చూడలేదు. స్థానికులు చనిపోయిన ఆవుకు పూజలు చేశారు. జియో నెట్‌వర్క్‌కు చెందిన స్తంభాలు విద్యుత్ విద్యుత్ లైన్లకు సమీపంలో ఉండకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది

బంగారు నగలు చోరీ.. కేసు నమోదు

నిమ్మనపల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): బీరువాలో దాచి ఉంచిన బంగారు నగలు అపహరణకు గురయ్యాయని కొండయ్యగారిపల్లికి చెందిన రెడ్డెప్పరెడ్డి, శోభారాణి దంపతులు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ 4 జతల కమ్మలు, చైన్‌లు, ఇతర వస్తువులు కలిపి సుమారు 500 వందల గ్రాములు బంగారు నగలు చోరీ అయ్యాయని బాధితులు ఫిర్యాదు చేయడంతో సంఘటనా స్థలాన్ని, ఇంటి పరిసర ప్రాంతాలను పరిశీలించామన్నారు. వారం రోజుల క్రితం ఇంటి పనులు చేసేందుకు వచ్చిన ముగ్గురు వ్యక్తులపై బాధితులు అనుమానం వ్యక్తం చేశారన్నారు. క్లూస్ టీమ్‌ను రంగంలోకి దింపి దొంగలను పట్టుకొనేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు.

పట్టపగలే నగల చోరీ

రాజుపాలెం, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని రాజుపాలెం గ్రామంలో శనివారం పట్టపగలు బీరువా పగలగొట్టి ఐదు తులాల బంగారు దోచుకెళ్లినట్లు ఎస్‌ఐ వెంకటరమణ తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు.. ధనిరెడ్డిన సుశ్మిత అనే మహిళ ఇంటిలోని బీరువా పగలగొట్టి మూడు తులాల నల్లపూసల దండ, 2 తులాల గొలుసు దోచుకెళ్లినట్లు తెలిపారు. అదే గ్రామంలో ముందుగా ఒక ఇంటి తాళాలు పగులగొట్టిన దొంగలు అక్కడ ఏమీ లేకపోవడంతో రెండో ఇంటిలో చోరీ చేశారు. తెలిపారు. గత వారంలో కూడా టంగుటూరులో ప్రసాద్ అనే వ్యక్తి ఇంటి తాళాలు పగలగొట్టి బంగారు దోచుకెళ్లనట్లు తెలిపారు.

ఇరువర్గాల ఘర్షణ.. 8 మందిపై కేసు నమోదు

నిమ్మనపల్లి, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఇరువర్గాలు ఘర్షణ పడడంతో 8 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తవళం పంచాయతీ చౌకిళ్లవారిపల్లికి చెందిన కొందరు వ్యక్తులు పబ్లిక్ స్థలంలో గొడవపడి, దాడి చేసుకున్నారన్నారు. ఇరువర్గాలకు చెందిన 8మందిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

రోడ్డు ధ్వంసం చేసినందుకు..

చాపాడు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేసినందుకు మండలంలోని పడమర అనంతపురం గ్రామానికి టీడీపీ నాయకులునందిమండలం మల్లికార్జునరెడ్డి, బాలసుబ్బారెడ్డిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ నెల 19న శనివారం తిప్పిరెడ్డిపల్లె దళితవాడలోని సిమెంటు రోడ్డును వీరు ఎక్స్‌కవేటర్‌తో పగులకొట్టి ధ్వంసం చేశారన్నారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు వీరిపై కేసులు నమోదు చేసినట్లు వారు తెలిపారు.

నిమ్మనపల్లిలో 144 సెక్షన్ అమలు.

నిమ్మనపల్లి, జూలై 20(ఆంధ్రజ్యోతి): నిమ్మనపల్లి మండలంలో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎంపీ మిథున్ రెడ్డిని మద్యం కేసులో శనివారం సిట్ అరెస్ట్ చేయడంతో, ఎలాంటి అల్లర్లు జరగకుండా , ప్రభుత్వ ఆస్తులకు నష్టం వాటిల్లకుండా ముందు జాగ్రత్తగా ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. 144 సెక్షన్‌ను ప్రతి ఒక్కరూ తప్పకుండా పాటించాలని లేని పక్షంలో కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం


టైరు పేలడంతో తుప్పల్లోకి దూసుకెళ్లిన కారు

కొండాపురం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంజిఅనంతపురం సబ్‌స్టేషన్ వద్ద ఆదివారం ప్రొద్దుటూరు నుంచి తాడిపత్రికి వెళుతున్న కారు టైరు పేలిపోయింది. దీంతో కారు రోడ్డు పక్కకు దిగి తుప్పల్లోకి దూసుకుపోయింది. బెలున్‌లు తెరుచు కోవడంతో అందులో ప్రయాణిస్తున్న తండ్రి, కూతుళ్ల సురక్షితంగా బయట పడ్డారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరుగలేదని స్థానికులు తెలిపారు.

మిథున్ అరెస్టుపై రాద్ధాంతం తగదు

- టీడీపీ, జనసేన, బీజేపీ నేతల విమర్శలు


సమావేశంలో మాట్లాడుతున్న తెలుగు యువత అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు, జనసేన నేత రాందాస్‌చౌదరి

మదనపల్లె టౌన్, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఏపీ లిక్కర్ స్కామ్‌లో నిందితుడైన మిథున్‌రెడ్డిని అరెస్టు చేస్తే మదనపల్లె వైసీపీ నేతలు ఉలిక్కిపడి రాద్ధాంతాం చేయడం తగదని తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు విమర్శించారు. ఆదివారం స్థానిక దేవతానగర్‌లోని టీడీపీ పార్లమెంట్ కార్యాలయంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతలు ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లిక్కర్‌స్కామ్ నిందితుడు మిథున్‌రెడ్డి సుప్రీం కోర్టు, హైకోర్టుకు ముందస్తు బెయిల్ కోసం ఎందుకు దరఖాస్తు చేసుకున్నాడన్నారు. వైసీపీ పాలనలో లిక్కర్ కల్తీతో జంగారెడ్డిగూడెంలో 27 మంది మృతి చెందిన విషయం వైసీపీ నేతలు మరచిపోయారా అని ప్రశ్నించారు. రూ.వేలాది కోట్లను హవాలా రూపంలో తరలించారన్నారు. జగన్ కూడా జైలుకు పోయే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ద్వారకనాథరెడ్డి కూడా మదనపల్లె ఫైల్స్ దహనం కేసులో అరెస్టు కాక తప్పదన్నారు. పెద్దిరెడ్డి కుటుంబం భూకబ్జాలకు పాల్పడిన విషయం ప్రజలకు తెలుసన్నారు. మిథున్‌రెడ్డి అరెస్టుపై వైసీపీ నేతలు జైళ్ల గోడలు బద్దలు కొడతామనడం శాంతిభద్రతలకు విఘాతమే అన్నారు. జనసేన రాయలసీమ రీజనల్ కోఆర్డినేటర్ గంగారపు రాందాస్‌చౌదరి మాట్లాడుతూ వైసీపీ పాలనలో మద్యం దుకాణాల వద్ద డిజిటల్ పేమెంట్స్ ఎందుకు అనుమతించలేదన్నారు. నగదుతోనే మద్యం విక్రయించడంలో పరమార్థం ఏమిటన్నారు. మద్యం దుకాణాల నుంచి వచ్చిన సొమ్మంతా తాడేపల్లె ప్యాలెస్‌కు తరలించారన్నారు. వైసీపీ పాలనలో స్కాములు, హత్యలు, జైళ్ల అరాచక పాలన సాగించారన్నారు. జగన్ వ్యక్తిత్వానికి భయపడిన ప్రజలు ఆయనకు కేవలం 11 సీట్లు మాత్రమే ఇచ్చాని గుర్తు చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ జంగాల శివరాం మాట్లాడుతూ సీఎం చంద్రబాబు చెప్పినట్లు అవినీతిపరులను చెత్త ఊడ్చినట్లు ఊడ్చి వేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు దొరస్వామి నాయుడు, దేవరింటి శ్రీనివాసులు, నాదెళ్ల అరుణ్‌తేజ, మహబూబ్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

నిందితులను పట్టుకోమంటే.. మాపైనే కేసులు పెడతారా?

- బాస్ అధినేత పీటీఎం శివప్రసాద్


శివప్రసాద్ ఇంటికి నోటీసులు అంటిస్తున్న పోలీసులు

మదనపల్లె, జూలై 20(ఆంధ్రజ్యోతి): గుండె జబ్బుతో బాధ పడుతున్న తనతోపాటు, నిందితులను పట్టుకోమని డిమాండ్ చేసిన దళిత సంఘాలపై పోలీసులు కేసులు పెట్టి వేధిస్తున్నారని బాస్ అధినేత పీటీఎం శివప్రసాద్ ఆరోపించారు. అంకిశెట్టిపల్లె గుట్టపై వెలసిన గౌతమ బుద్ధుడి తల నరికిన నిందితులను పట్టుకోమంటే, ప్రశ్నించిన దళిత సంఘాల నేతలపై కేసులు పెట్టి వేధించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ కేసును తప్పుదోవ పట్టించేందుకు ఎస్పీ తమపై వేధింపులకు పాల్పడుతున్నాడని శివప్రసాద్ ఆరోపించారు. తాను కోలార్ ఆస్పత్రికి వెళ్లి వచ్చేలోగా తనపై పెట్టిన మూడు తప్పుడు కేసులకు సంబంధించిన నోటీసులు తమ ఇంటికి అంటించి అవమానించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్పీ నన్ను ఏం చేయాలను కుంటున్నాడో తెలియడం లేదని, తాము బుద్ధిస్టులమని, ఎవరినీ ఇబ్బంది పెట్టే వాళ్లం కాదని, అయితే ఇన్ని ఇబ్బందులు పెడుతున్న పోలీసులు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

జర్నలిజం లలితకళల కోర్సుల్లో నేటి నుంచి నేరుగా ప్రవేశాలు

కడప ఎడ్యుకేషన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వ విద్యాలయంలో పోస్టు గ్రాడ్యుయేషన్ డిప్లమో కోర్సులలో ప్రవేశానికి ఈనెల 21 నుంచి 31 వరకు నేరుగా ప్రవేశాల కౌన్సెలింగ్ నిర్వహి స్తున్నట్లు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ టి.లక్ష్మీప్రసాద్ తెలిపారు. జర్నలిజం శాఖ ఆధ్వర్యంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిప్లమో ఇన్ పబ్లిక్ రిలేషన్ (పీజీడీపీఆర్), పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిప్లమో ఇన్ తెలుగు జర్నలిజం (పీజీడీటీజే), ఫైన్ ఆర్ట్స్ శాఖ ఆధ్వర్యంలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ డిప్లమా ఇన్ థియేటర్ ఆర్ట్స్ కోర్సులకు ప్రవేశాల కౌన్సెలింగ్ జరగనుందన్నారు. పీజీ డిప్లొమా కోర్సులలో ప్రవేశానికి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నారు. కౌన్సెలింగ్‌కు అ భ్యర్థులు అన్ని రకాల అర్హత పత్రాలతోనేరుగా యూనివర్సిటీలో హాజరుకావాలని సూచించారు. వివరాలకు యోగివేమన విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూ డబ్ల్యూ.వైవీయు.ఇడియు.ఇన్ ను సందర్శించాలని సూచించారు.

బైకును ఢీకొన్న లారీ .. ఒకరికి తీవ్రగాయాలు

ముద్దనూరు జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామం వద్ద శనివారం రాత్రి బైకును లారీ ఢీకొనడంతో రవిశంకర్ అనే వ్యక్తికి తీవ్రగాయలైనట్లు ఎస్‌ఐ మైనుద్దీన్ తెలిపారు. పులివెందులకు చెందిన రవిశంకర్ ఎర్రగుంట్ల వైపు నుంచి బైకుపై పులివెందులకు వెళుతుండగా, అదే వైపు వెళుతున్న లారీ తిమ్మాపురం స్పీడ్ బ్రేకర్ వద్ద ఢీకొనడంతోపాటు బైక్‌ను కొంతదూరం లాక్కొని వెళ్లింది. దీంతో రవిశంకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. విషయం గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని వెంటనే 108 వాహనంలో ప్రొద్దుటూరులోని ప్రభుత్వ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సలహా మేరకు హైదరాబాదుకు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

11 మంది జూదరుల అరెస్టు

- రూ.1.45లక్షలు, బైక్‌లు, కార్లు స్వాధీనం

చక్రాయపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సమీపంలో పేకాట ఆడుతున్న 11 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ. 1,45,100 స్వాధీనంచేసుకున్నట్లు సీఐ ఉలసయ్య తెలిపారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ చక్రాయపేటకు తూర్పు దిక్కున 3 కిలోమీటర్ల దూరంలో మల్లెపల్లె రాజశేఖర్‌కు చెందిన నిమ్మతోటలో నిర్వహిస్తున్న పేకాట కేంద్రంపై ఆదివారం దాడులు చేశామన్నారు. 11 మందిని అరెస్టు చేసుకొని, రూ. 1,45,100 నగదు, 11 మొబైల్ ఫోన్లు, 4 మోటార్ సైకిళ్లు, రెండు కార్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ రంగారావు, సిబ్బంది పాల్గొన్నారు.

కనుమరుగవుతున్న కాడెద్దులు



కాడెద్దులతో వేరుశనగ విత్తనాలు వేస్తున్న రైతు (ఫైల్ ఫొటో)

పల్లెల్లో ప్రతి ఇంటా ఎద్దులు, బండ్లు ● వ్యవసాయంలో యాంత్రిక విప్లవం

తంబళ్లపల్లె, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఒకపుడు రైతుల జీవితంలో కాడెద్దులు, ఎడ్లబండ్లు ప్రముఖ పాత్ర పోషించేవి. పొలం దుక్కి దున్నాలన్నా, విత్తనం వేయాలన్నా, పంటను ఇంటికి చేర్చాలన్నా ఎద్దులు, ఎడ్లబండ్లు లేనిదే పనులు జరిగేవి కావు. గ్రామాల్లో ఏ ఇంటి ముందు చూసినా కనీసం జత కాడెద్దులు, ఎడ్లబండి కనిపించేవి. మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయంలో యాంత్రీకరణ పెరిగిపోయింది. పొలం దున్నడం మొదలు పంటను కోసి ఇంటికి చేర్చే వరకు ట్రాక్టర్లు, రకరకాల యంత్ర పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో రోజురోజుకూ పొలంలో కాడెద్దులు కట్టి..నాగలి పట్టే రైతులు కనుమరుగవుతున్నారు. గతంలో పల్లెల్లో రైతుల ఇళ్ల ముందు కనిపించిన ఎద్దులు, ఎడ్లబండి స్థానంలో నేడు ట్రాక్టర్లు, వ్యవసాయంలో ఉపయోగించే యంత్రాలు కనిపిస్తున్నాయి. దీంతో సేద్యం మొదలైన వందల తరాల నుంచి మానవ జీవన ప్రవంతిలో భాగమై రైతులకు చేదోడు వాదోడుగా ఉన్న ఎద్దులు, ఎడ్లబండ్లు యాంత్రిక విప్లవంతో కనుమరుగు అవుతుండటం పట్ల వృద్ధ రైతులు ఆవేదన చెందుతున్నారు.

పల్లెల్లో ప్రతి ఇంట్లో కాడెద్దులు

గతంలో ఏ పల్లెలో చూసినా ఎకరా పొలం ఉన్న ప్రతి రైతు ఇంట్లో కనీసం జత కాడెద్దులు, ఎడ్లబండి ఉండేవి. ఇంటి ముందు మంచి ఎద్దులు, బండి ఉండటం రైతులు ఓ హోదాగా భావించేవారు. ఎద్దులను కన్న బిడ్డల్లా చూసుకునేవారు. పశువుల ఎరువు పొలాలకు తరలించడం, ఎరువులు, పొలం దున్నడం, వ్యవసాయ పనిముట్లు, కూలీలను సాగు భూముల్లోకి తీసుకెళ్లడం, దుక్కి దున్ని విత్తనాలు వేయడం, కలుపు తీయడం, పంటను ఇంటికి చేర్చడం వంటి అధిక శాతం పనులను ఎద్దులు, ఎడ్లబండిని ఉపయోగించేవారు. అసలు కాడెద్దులు, బండి లేకుండా వ్యవసాయం నడిచేది కాదు. దీంతో గతంలో ఎద్దులకు విపరీతమైన డిమాండ్ ఉండేది. పంట కోసి ఇంటికి చేర్చే వరకు ప్రతి పనీ ట్రాక్టర్‌తో జరిగిపోతుండడం, ఏ పల్లెలో చూసినా పదుల సంఖ్యలో ట్రాక్టర్లు ఉండడంతో ఎద్దులకు చాలా వరకు డిమాండ్ తగ్గిందనే చెప్పవచ్చు. ప్రస్తుతం రైతుల కు కాడెద్దులను పోషించే ఆర్థిక స్థోమత ఉన్నప్పటికీ వాటికి నీరు పెట్టడం, మేతకు తీసుకెళ్లడం వంటి పనులకు సమయం లేకపోవడం, పశుగ్రాసానికి డిమాండ్ ఏర్పడటం, సంరక్షణ వంటి కారణాలతో వాటి పోషణ భారంగా మారింది. దీంతో రైతులు ఒక్కొక్కరుగా ఎద్దులను అమ్మేసి వ్యవసాయ పనులను సొంత, అద్దె ట్రాక్టర్లతో చేయించు కుంటున్నారు.

పెరుగుతున్న యాంత్రీకరణ

మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు వ్యవసాయంలో సాంకేతికతను వినియోగించుకుంటున్నారు. వాతావరణ పరిస్థితులు మొదలు కొని నాట్లు వేయడం, విత్తనాలు వేయడం, కలుపు తీయడం, పంట కోత కోసి ఇంటికి చేర్చడం వరకు యంత్రాల వాడకం రోజురోజుకూ పెరుగుతోంది. దీనికి తోడు ప్రభుత్వం రైతులకు రాయితీపై ట్రాక్టర్లు, వివిధ యంత్ర పరికరాలు అందిస్తుండడం, యంత్రాలతో వ్యవసాయ పనులు త్వరగా అవుతుండడం, రైతుకు ఖర్చుతో పాటు శ్రమ తగ్గుతుండడంతో ఎక్కువగా యంత్రాల వైపు మొగ్గు చూపుతున్నారు. పొలం దున్నడానికి (ఐదు మడకలు, తొమ్మిది మడకలు), పొలం దుక్కి చేయడానికి రోటోవేటర్, విత్తనాలు వేయడానికి సీడ్ డ్రిల్, కలుపు తీయడానికి వీడర్, పంట కోయడానికి హార్వెస్టర్లు, మందులు పిచికారీ చేయడానికి డ్రోన్లు ఇలా భూమి దున్నడం నుంచి పంట దిగుబడిని నూర్పిడి చేసి ఇంటికి చేర్చడం వరకు దాదాపు అన్ని వ్యవసాయ పనులకు యంత్రాలు అందుబాటులో ఉన్నాయి.

కనమరుగవుతున్న కాడెద్దులు

వ్యవసాయంలో యంత్రాల వాడకం పెరుగుతుండడంతో ఒకప్పుడు వ్యవసాయంలో కీలక పాత్ర పోషించిన కాడెద్దులు క్రమంగా కనుమరుగయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఎద్దులతో పోలిస్తే యంత్రాలతో సేద్యం కొంచెం ఖర్చుతో కూడుకున్నదే. అయినా ఎద్దులతో ఒక రోజు చేసే పని ట్రాక్టర్‌తో రెండు, మూడు గంటల్లో జరిగిపోతోంది. కూలీల ఖర్చు తగ్గి తక్కువ సమయంలోనే ఎక్కువ పనిజరుగుతుండడంతో రైతులు ట్రాక్టర్లు, యంత్రాలతో సేద్యానికే మొగ్గు చూపుతున్నారు. పశుగ్రాసానికి విపరీతమైన డిమాండ్ ఏర్పడటం, ఎద్దుల సంరక్షణకు ప్రత్యేకంగా ఒకరు ఉండాల్సి ఉండటం వంటి కారణాలతో దాదాపు రైతులు ఉన్న ఎద్దులను అమ్మేస్తున్నారు.



వరి పైరు కోస్తున్న హార్వెస్టింగ్ (ఫైల్)



ట్రాక్టర్‌తో పొలం దున్నతున్న రైతు

వైభవంగా ఆడికృత్తిక మహోత్సవం



కావడులతో ఆలయానికి వెళ్తున్న భక్తులు



విశేష పూజలందుకుంటున్న సుబ్రహ్మణ్యస్వామి

వాల్మీకిపురం, జూలై 20(ఆంధ్రజ్యోతి): ధర్మపథం సమూహాలయంలో ఆదివారం ఆడికృత్తిక మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. షిరిడీసాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఆలయంలో సుబ్రహ్మణ్యస్వామికి ప్రథమ, ద్వితీయ, తృతీయ పాలాభిషేకాలు నిర్వహించి తోమాలసేవలతో ప్రత్యేకాలంకరణలు చేసి పూజలు గావించారు. ఆడికృత్తిక సందర్భంగా సుబ్రహ్మణ్యస్వామి భక్తులు పాలు, పూలు, తేనె కావిడులతో పట్టణంలో ఊరేగింపు నిర్వహించిన అనంతరం ఆలయంలో స్వామివారికి సమర్పించి మొక్కులు చెల్లించారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరు కాగా ట్రస్టు ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీ, అన్నవితరణ కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమాల్లో ఆలయ ట్రస్టు సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవార్ల జాతర మహోత్సవాలు



వాల్మీకిపురం, జూలై 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఆదివారం అమ్మవార్ల ఆలయాల్లో జాతర మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. స్థానిక వాల్మీకి నగర్‌లోని బోయకొండ గంగమ్మ దేవాలయం, కొత్త ఇందిరమ్మకాలనీలోని దుర్గాదేవి అమ్మవారి ఆలయం, స్థానిక లాభాలగంగమ్మ తల్లి ఆలయాల్లో ఆదివారం ఉదయం నుంచి అభిషేకాలు, విశేష పూజా కార్యక్రమాలు జరిగాయి. ఆలయాలు కొత్తగా నిర్మించి మండలం రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా గంగరాళ్లకు జలాభిషేకం, మహిళల దీలుబోణాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవార్లకు మొక్కులు చెల్లించారు. కమిటీ సభ్యులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా మొగసాల గంగమ్మ జాతర



గుర్రంకొండ, జూలై 20(ఆంధ్రజ్యోతి): తరిగొండ గ్రామంలో వెలసిన మొగసాల గంగమ్మ జాతరను గ్రామస్థులు వైభవంగా చేసుకున్నారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, అభిషేకాలను నిర్వహించారు. అనంతరం అమ్మవారిని రంగు రంగు పూలతో అలకరించి భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. సాయంకాలం అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు.

'బ్రేక్‌ఫాస్ట్‌లో బల్లి'పై నేడు అంతర్గత విచారణ



విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇస్తున్న వైద్య సిబ్బంది

కలికిరి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినుల హాస్టల్ అల్పాహారంలో బల్లి పడిన ఘటనపై అంతర్గత విచారణ నిర్వహించాలని యాజమాన్యం నిర్ణయించింది. ఆదివారం సెలవు కావడంతో సోమవారం ఈ విచారణ చేపట్టనున్నట్లు సమాచారం. ప్రిన్సిపాల్ వెంకటేశ్వర రావు పర్యవేక్షణలో వైస్ ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో మరి కొందరు అధ్యాపకులతో కూడిన బృందం ఈ సంఘటన పూర్వాపరాలపై కూలంకశంగా విచారణ చేయనున్నారు. అనంతరం నివేదికను వర్శిటీ అధికారులకు పంపనున్నారు. దీనిపై యూనివర్శిటీ తీసుకునే నిర్ణయంపై తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు చెపుతున్నారు.

జేఎన్టీయూలో ఆరోగ్య శిబిరం ఏర్పాటు

జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినుల అల్పాహారంలో బల్లి పడిన ఘటనపై స్థానిక వైద్య శాఖ అధికారులు స్పందించారు. ఆదివారం వైద్య బృందం కళాశాల హాస్టల్‌కు వెళ్లి మొదట బల్లిపడిన విధానాన్ని పరిశీలించి విద్యార్థిని, విద్యార్థులను విచారించారు. సంఘటన తరువాత ఎవరికైనా అనారోగ్య సూచనలు ఉన్నాయా అంటూ ఆరా తీశారు. విద్యార్థిని ప్రిన్సిపాల్‌కు పంపిన ఫొటోను పరిశీలించారు. ఇది డైనింగ్ హాల్‌లో తీసింది కాదని, హాస్టల్ డార్మిటరీ గదిలో తీసిన ఫొటోగా నిర్ధారించారు. అనంతరం విద్యార్థులకు ప్రాథమిక పరీక్షలను నిర్వహించారు. వంట గదులను, వండిన పాత్రలను కూడా పరిశీలించారు. వ్యక్తిగత పరిశుభ్రత గురించి విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. మేడికుర్తి పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ సుధాకర్, అసిస్టెంట్ షఫీ, జగన్‌మోహన్, ఏఎన్ఎం మాధవి, కలికిరి-3 ఏఎన్ఎం నఫీజా పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణం



నూతన అధ్యక్షుడిని అభినందిస్తున్న రాటకొండ గురుప్రసాద్

మదనపల్లె అర్బన్, జూలై 20(ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ సేవలను విస్తృతం చేస్తామని లయన్స్ క్లబ్ ఫాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం స్థానిక శ్రీదేవి గార్డెన్స్‌లో లయన్స్ క్లబ్ నూతన అధ్యక్ష, కార్యవర్గ సభ్యుల ప్రమాణస్వీకారం నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. మదనపల్లె పట్టణంలో మొట్టమొదటసారీ కంటి ఆస్పత్రిని ఏర్పాటు చేసి ఎందరికో ఉచితం కంటి పరీక్షలు, ఆపరేషన్లు, ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. నూతన అధ్యక్షుడిగా మార్వారి వరణ్‌ను నియమించారన్నారు. కార్యక్రమంలో లయన్స్ ఎంజెఎఫ్ గౌతమ్‌రెడ్డి, కంటి ఆస్పత్రి ఛైర్మన్ భాస్కర్‌నాయుడు, రవికాంతనాయుడు, జ్ఞానాంబిక కాలేజ్ కరస్పాండెంట్ రాటకొండ గురుప్రసాద్, శశిధర్ నాయుడు, నాగార్జునబాబు, దేవేంద్ర, ద్వారకనాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మూర్ఛరోగులకు వైద్య శిబిరంలో సేవలు



మూర్ఛరోగులకు చికిత్స చేస్తున్న డాక్టర్లు

మదనపల్లె అర్బన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక అమ్మచెరువు మిట్టలోని వెలుగు సంస్థలో ఆదివారం మూర్ఛరోగులకు వైద్య శిబిరం నిర్వహించారు. సంస్థ సెక్రటరీ ఉదయ్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ సంస్థలో మూర్ఛ వ్యాధి మెడికల్ క్యాంపులో పిల్లలకు వైద్య సేవలను అందించడం చాలా ఆనందంగా ఉందన్నారు. డాక్టర్ ప్రతి ఒక్కరినీ ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వెలుగు సిబ్బంది, మూర్ఛ రోగులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేషస్పందన



ఉచిత వైద్య శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ రాజేంద్రప్రసాద్

మదనపల్లె అర్బన్, జూలై 20(ఆంధ్రజ్యోతి): సాయి సంజీవని కిడ్నీ హాస్పిటల్, భరతమాత స్ఫూర్తి కేంద్రం, మదనపల్లె రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్తంగా అమ్మచెరువు మిట్ట, ప్రభుత్వ పాఠశాల్లో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఆదివారం షుగర్, బీపీ పరీక్షలు, రోగులకు కిడ్నీ స్కానింగ్ నిర్వహించారు. యూరాలజిస్ట్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రోగం లక్షణాలను గురించి ప్రజలకు వివరించారు. ఇందులో 50 మందికి పైగా రోగులు పాల్గొన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా స్పెషల్ అధ్యక్షుడు రాజగోపాల్‌రెడ్డి, మదనపల్లె రెడ్‌క్రాస్ కార్యదర్శులు డీఆర్ జగదీష్, పెరవలి శ్రీనివాసులు, మున్సిపల్ కౌన్సిలర్ చంద్రశేఖర్, ఆనంద్, మీనా,రాజేష్, ప్రవీన్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల డిమాండ్లను సానుభూతితో చూడాలి



బి.కొత్తకోటలో ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

బి.కొత్తకోట, జూలై 20(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికులు చేస్తున్న సమ్మె పట్ల ప్రభుత్వం సానుభూతితో ఆలోచించాలని రాష్ట్ర పంచాయతీ కార్మికుల సంఘం అధ్యక్షుడు వెంకట్రామయ్య పేర్కొన్నారు. ఆదివారం బి.కొత్తకోట నగరపంచాయతీ కార్యాలయం ఎదుట నాలుగోరోజు స్థానిక పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మెలో ఆయన పాల్గొన్నారు. కార్మికులు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. తమ డిమాండ్ల పరిష్కారమయ్యే వరకు నిరవధికంగా సమ్మె కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు కార్మిక యూనియన్ నేతలు పాల్గొన్నారు.

మాట తప్పని సుపరిపాలన



పట్టణంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, టీడీపీ పరిశీలకులు

మదనపల్లె టౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీలు, సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తూ మాట తప్ప కుండా సంక్షేమ పథకాలు అందిస్తూ సుపరిపాలన అందిస్తున్న ఘనత సీఎం చంద్రబాబుదే అని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. ఆదివారం మున్సిపల్ కౌన్సిలర్ తులసి, రామకృష్ణాచారి ఆధ్వర్యంలో 20వ వార్డు త్యాగరాజువీధిలో సుపరిపా లన-తొలి అడుగులో భాగంగా ఎమ్మెల్యే, నియోజకవర్గ పరిశీలకులు గురుమూర్తి గౌడు, చమర్తి సురేష్‌రాజు కలసి ఇంటింటా తిరిగి ప్రభుత్వ పథకాలపై విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. అనంతరం గౌస్‌అహ్మద్‌కు రూ.14వేలు సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. టీడీపీ నేతలు ఎస్ఏ మస్తాన్, సిమెంట్ రమణ, బాబునాయుడు, ఖాజా పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్‌తో బాధితులకు ఊరట

మదనపల్లె, జూలై 20(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) సొమ్ము బాధితులకు ఊరట లభిస్తోందని ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాష అన్నారు. వివిధ కారణాలతో అనారోగ్యానికి గురైన బాధితులకు ఆస్పత్రి బిల్లుల ఆధారంగా సీఎం దృష్టికి తీసుకెళ్లి ఆ సొమ్మును తిరిగి తెప్పిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించిన ఎమ్మెల్యే బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. త్యాగరాజవీధి, కనకదాస్‌నగర్, దక్నీపేట, తదితర ప్రాంతాల్లో పది మందికి రూ.20లక్షల విలువైన చెక్కులు ఇంటింటికీ వెళ్లి అందజేసి, వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గంలో మదనపల్లె మున్సిపాలిటీ, మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం మండలాల్లో వంద మందికి రూ.4కోట్లకుపైగా చెక్కుల రూపంలో సొమ్ము అందజేసినట్లు ఎమ్మెల్యే వివరించారు. టీడీపీ నేతలు ఎస్.షమ్ షీర్, బాబా, రఘుపతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

కోళ్లబైలు భూమిని ఎరుకలకే కేటాయించాలి

జనరల్ సెక్రటరీ బొజ్జప్ప

మదనపల్లె అర్బన్, జూలై 20(ఆంధ్రజ్యోతి): కోళ్లబైలులో ఎరుకల ఎంప్లాయీస్ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ కొనుగోలు చేసిన 9.15 ఎకరాల భూమి ఎరుకలకే కేటాయించాలని ఎంప్లాయీస్ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ జనరల్ సెక్రటరీ పి. బొజ్జప్ప డిమాండ్ చేశారు. ఆదివారం ఎరుకల ఉద్యోగ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1998లో బీసీల వద్ద ప్రభుత్వ భూమిని గిరిజన ఉద్యోగ సహకార సంఘ సభ్యులు కొనుగోలు చేశారన్నారు. 25 ఏళ్లగా కొందరు ఆ భూమిని ఆక్రమించడానికి ప్రయత్నిస్తుండగా పోరాటాలు సాగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నిజు'నలు చేశామని, ఉన్నతాధికారులు, మంత్రులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఎరుకల ఎంప్లాయీస్ సొసైటీ అనుభవంలోనే భూమి ఉందన్నారు. ప్రభుత్వం మార్కెట్ విలువ కట్టించుకుని ఆ భూమిని ఎరుకలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పి. వేమనారాయణ, ఈశ్వరయ్య, వెంకటప్ప, వెంకటేశ్వర్లు, ఆనంద్, రామచంద్ర, వెంకట నారాయణ, పరుశురామ్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ప్రశాంత్ నియామకం



మదనపల్లె అర్బన్, జూలై 20 (ఆంధ్ర జ్యోతి): బీజేపీ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎల్లంపల్లి ప్రశాంత్ నియమితులయ్యారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయి లోకేష్ నియామక ఉత్తర్వులు విడుదల చేసినట్లు ప్రశాంత్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ బలోపేతానికి అహర్నిశలూ కృషి చేస్తానన్నారు.

నిలుచున్న చోటే బస్ స్టాండ్

దశాబ్దాలుగా ఎవరికీ పట్టని వైనం



పెద్దమండ్యంలో బస్సు ఎక్కుతున్న ప్రయాణీకులు

పెద్దమండ్యం, జూలై20(ఆంధ్రజ్యోతి): మదనపల్లి - గాలివీడు రహదారి వయా అంగళ్లు, గుర్రంకొండ, కలిచెర్ల, పెద్దమండ్యం ఆర్టీసీ బసులు నడిచే గ్రామాల్లో నిలుచున్న చోటే బస్‌స్టాండ్‌గా చెప్పుకోవాల్సి వస్తోంది. ఈ మార్గాల్లో ప్రయాణీలకు ఆర్టీసీ బస్‌స్టాండ్ నిర్మాణాలు చేపట్టాలని దశాబ్దాలుగా ప్రజాప్రతినిధులు, ఆర్టీసీ అధికారులు ప్రజలు కోరారు. మండల సమావేశాల్లో సభ్యులు చర్చించారు. ఇప్పటి వరకు ప్రయాణీలకు బస్‌స్టాండ్ నిర్మాణ సౌకర్యాలు పూర్తి చేయలేకపోతున్నారని విమర్శలొస్తున్నాయి. గుర్రంకొండలో మాత్రం అనువు గాని చోట బస్‌స్టాండ్ నిర్మించారని, అక్కడికి బస్సుల రాకపోకలు జరగడం లేదని ప్రయాణీకులు వాపోతున్నారు. పెద్దమండ్యంలో రెండేళ్లగా బస్‌స్టాండ్ నిర్మాణం పనులు సాగుతూనే ఉన్నాయని ప్రజలు వాపోతున్నారు. మదనపల్లి- తిరుపతి మార్గంలో ఆర్టీసీకి ఆదాయం తరవాత మదనపల్లి -గాలివీడు మార్గంలో అత్యధికంగా ఆర్టీసీకి ఆదాయం తెస్తున్నట్లు అధికారులు తెలిపారు. మదనపల్లి - గాలివీడు వయా అంగళ్లు, గుర్రంకొండ, కలిచెర్ల, పెద్దమండ్యం గాలివీడు మార్గంలో మదనపల్లి -2 డిపోకు చెందిన 12 బస్సుల నడుస్తున్నాయి. పండుగలు మినహాయించి రోజుకు రూ. 1.20 లక్షలు నుంచి 1.40 లక్షలు కలెక్షన్లు వస్తున్నాయని ఆర్టీసీ సిబ్బందే వెల్లడించారు. ఈ లెక్క ప్రకారం నెలకు రూ. 39 లక్షలు కలెక్షనులు వస్తున్నాయి. ఏడాది రాబడి అంచనా వేస్తే ప్రయాణీల నుంచి రాబడుతున్న ఆదాయం ఎంత ? ఆర్టీసీ ప్రయాణీలకు కల్పిస్తున్న సౌకర్యాలు ఎంత అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ మార్గాల్లో సౌకర్యాలు గురించి చర్చిస్తే ఆర్టీసీ అధికారులు, ప్రజాప్రతినిధులపై ప్రయాణీకుల నుంచి విమర్శలొస్తున్నాయి. ఆర్టీసీ బస్‌స్టాండ్ నిర్మాణాలకు ప్రజాప్రతినిధులు మంజూరుకు కృషి చేయలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాలుగా ఈ మార్గంలో బస్సు షెల్టర్లు లేక ప్రయాణీకులు నరకయాతన పడుతున్నారు. మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలతో ప్రయాణంలో బస్‌స్టాప్ రోడ్లపైన నిలుచుని బస్సులు వచ్చే వరకూ వేచి చూడాల్సి వస్తోందని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షకాలం, ఎండకాలంలో ప్రయాణీలు ఇక్కట్లుకు గురవుతున్నారు. పలు చోట్ల కనీసం మరుగుదొడ్లు లేక మహిళల, చిన్న పిల్లలు బాధలు చెప్పలేనివని ప్రయాణీలు వాపోతున్నారు. అంగళ్లులో పేరు పొందిన ఇంజనీరు కాలేజీలు వున్నాయి. టమోటా మార్కెట్, గొర్రెల సంత కూడ వుంది. ఇక్కడ బస్‌స్టాండ్ లేక పోవడంతో విద్యార్థు లు, రైతులు, అంతర్ జిల్లా ప్రయాణీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రయాణీలకు తెలిపారు. ఈ మార్గంలో బస్‌స్టాప్‌లల్లో రెండు వైపులా ఓకే సారి బస్సులు వచ్చే సమయాల్లో ప్రయాణీలు పలు ఇక్కట్లకు గురవుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం బస్‌స్టాండ్ నిర్మాణాలపై దృష్టి సారించి చర్యలు తీసుకుని ప్రయాణీలకు బస్‌స్టాండ్ నిర్మాణాలు చేపట్టాలని ప్రజలు కోరారు.



పెద్దమండ్యంలో ఆగిన బస్‌స్టాండ్ నిర్మాణం



అంగళ్లులో బస్సు కోసం వేచి వున్న ప్రయాణీకులు